ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 146, పేజీలు - 08

శనివారం, నవంబర్ 28, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

ఏ పార్టీకి ప్లస్.? ఎవరికి మైనస్.?

- మొత్తం 12.69 లక్షల దరఖాస్తులు.. 80,635 తిరస్కరణ
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్‌లో 5.68 లక్షల ఓటర్లు
- వరంగల్-ఖమ్మం-నల్గొండలో 6.21 లక్షల ఓట్ల నమోదు
- భారీగా పెరిగిన ఓటర్ల సంఖ్యతో పార్టీల్లో రాజకీయ లెక్కలు
- యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లపై ప్రధాన పార్టీల గురి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమరం ఆసక్తికర మలుపు తిరుగుతోంది. రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల అధికారులు ముసాయిదా ఓటరు జాబితాలను విడుదల చేయడంతో రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. ఓటర్ల నమోదులో భారీ సంఖ్య నమోదవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తం 12,69,826 దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 11,89,191 దరఖాస్తులకు ఆమోదం లభించింది. అసంపూర్తిగా ఉండటం, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో 80,635 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఈసారి పెద్ద సంఖ్యలో కొత్త ఓటర్లు నమోదవడంతో వారి మద్దతు ఎవరికి దక్కుతుందన్నది ఎన్నికల్లో కీలకంగా మారనుంది.

మహబూబ్‌నగర్-హైదరాబాద్‌లో 5.68 లక్షల ఓట్లు

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని 156 మండలాల్లో ఓటరు జాబితా ప్రక్రియ పూర్తయింది. ఈ నియోజకవర్గంలో సుమారు 5.99 లక్షల దరఖాస్తులు అందగా, 5,68,105 దరఖాస్తులకు ఆమోదం లభించింది. మరో 31,314 దరఖాస్తులను తిరస్కరించారు. హైదరాబాద్, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాలతో పాటు ఐటీ ఉద్యోగులు, విద్యాసంస్థలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేయనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, యువత, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న వారి ఓటింగ్ సరళిపై రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి.

2లో..

డీలిమిటేషన్ బిల్లుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

- 50 శాతం సీట్ల పెంపు, 25 ఏళ్ల పాటు ఫ్రీజ్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజకీయ వ్యవస్థలో కీలక మార్పులకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రెడీ అవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన ప్రతిపాదనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తాజాగా జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరణలు, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిపాదన ప్రకారం అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యతో పోలిస్తే 50 శాతం పెంచనున్నారు. అదే సమయంలో రాష్ట్రాల మధ్య సీట్ల వాటాలో ఉన్న నిష్పత్తిని

2లో..

ఆహార కొరత లేదు.. నీటి సమస్యే తీవ్రం

- ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ విపత్తులు
- పర్యావరణ పరిరక్షణ బాధ్యత రైతులపైనా ఉంది
- డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు
- పెద్ద హోటళ్లలోనూ తనిఖీలు చేసే అధికారం టీజీ సేఫ్‌కు
- హైదరాబాద్‌లో జలవనరుల పరిరక్షణకు హైడ్రా చర్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రస్తుతం ఆహార ధాన్యాల కొరత లేదని, సరిపడా తిండిగింజలు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే నీటి సమస్య మాత్రం తీవ్రంగా ఉందని, అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని రాబోయే ఎనిమిది నెలల పాటు అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాలని

2లో..



రాజకీయాలు పక్కన పెట్టండి

డీలిమిటేషన్‌పై జనసేనాని పవన్ కళ్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల ప్రతిపాదనపై జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రియాక్ట్ అయ్యారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ కేంద్ర విధానానికి మద్దతుగా నిలిచారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా డీలిమిటేషన్ జరుగుతుందని, ఇది సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

2లో..

పరిశ్రమలు, అమరావతి పనులకు ఊతం

- చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- రాష్ట్రంలో సుమారు రూ.36 వేల కోట్ల పారిశ్రామిక పెట్టుబడులకు ఆమోదం
- అమరావతి సమీకృత సచివాలయం నిర్మాణ వ్యయం రూ.6,641 కోట్లకు పెంపు
- కడప జిల్లా మైలవరంలో సోలార్ ప్రాజెక్టు కోసం 1,127 ఎకరాల కేటాయింపు
- అనంతపురం, రైల్వేకోడూరు ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూ సమస్యల పరిష్కారం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఊతమిచ్చేలా 30 కీలక అంశాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటులో ఎదురయ్యే జాప్యాన్ని నివారించేందుకు ఉద్దేశించిన 'ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026'కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే సీఐఐ సదస్సులో ఒప్పందాలు చేసుకున్న 6 ప్రముఖ సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.36 వేల కోట్ల భారీ పెట్టుబడులు రావడంతో పాటు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా పెనుగొండలో రూ.19 వేల కోట్లతో కియా రెండో ప్లాంట్ ఏర్పాటుకు, శ్రీకాకుళంలో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్, అచ్యుతాపురంలో సెయింట్ గోబైన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా క్యాబినెట్ భారీగా నిధులను కేటాయించింది. హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ నిర్మాణ పనులకు

2లో..

డ్రగ్స్ రహిత భారత్ కోసం పనిచేద్దాం

- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్న నాగార్జున

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత ప్రధాని మోదీ తీసుకున్న నషా ముక్త్ భారత్ సంకల్పాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేద్దామని యువతకు టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్దామని, డ్రగ్స్, మత్తు మహమ్మారి లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని విజయవంతం చేద్దామన్నారు. అమీర్‌పేట్‌లో నాగార్జున మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత కనిపించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చాలా మంచి ఆలోచన, లక్ష్యంతో చేపట్టిన డ్రగ్స్ లేని భారత్ గా దేశాన్ని తీర్చిదిద్దడానికి అవగాహనా కల్పించే గొప్ప కార్యక్రమం అని పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసినందుకు కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

2లో..



వివాదరహిత భూములే లక్ష్యం

- భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ రీ సర్వే చేపట్టినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భూ రీ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి భూముల విస్తీర్ణం, సరిహద్దుల విషయంలో ఉన్న వివాదాలకు శాశ్వతంగా తెరదించుతామని వెల్లడించారు. ఇప్పటికే నక్షాలు లేని 373 గ్రామాల్లో తొలి విడత సర్వే చేపట్టామని డిసెంబర్ చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. రానున్న ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పూర్తి చేసి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన కొత్త పాస్ పుస్తకాలను రైతులకు ఉచితంగా

2లో..

కూకట్‌పల్లి భూముల వేలానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

3.15 ఎకరాల వేలానికి తొలగిన అడ్డంకులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ యార్డు భూముల వేలానికి తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ భూములను వేలం వేయకుండా నిలిపివేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను (పిల్) కోర్టు కొట్టివేసింది. దీంతో మూసాపేట పరిధిలోని ట్రక్ యార్డుకు చెందిన 3.15 ఎకరాల భూముల ఈ-వేలానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం వేలం నిర్వహించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు మార్గం సుగమమైంది. కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని ట్రక్ పార్క్ భూములను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు విక్రయించవద్దని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త కాంతారావు హైకోర్టును ఆశ్రయించారు. ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని అదే అవసరానికి వినియోగించాలని, వేలం ప్రక్రియను నిలిపివేయాలని పిటిషనర్లు కోరారు. ట్రక్ పార్క్ అసోసియేషన్ కూడా ఈ వ్యవహారంపై పిటిషన్ దాఖలు చేశారు.

ఈ వ్యాజ్యాలపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు పరిశీలించింది. పిటిషన్లలో ప్రజా ప్రయోజనం కనిపించడం లేదని పేర్కొంటూ వాటిని కొట్టివేసింది. ఈ భూములతో ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ట్రక్ యజమానులు ఎవరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. దీంతో వేలం నిర్వహణపై నెలకొన్న న్యాయపరమైన సందిగ్ధత తొలగిపోయింది.

మూసాపేటలో 3.15 ఎకరాలు.. కోకాపేటలో 4.59 ఎకరాలు

హెచ్ఎండీఏ శుక్రవారం

2లో..

హైదరాబాద్ మార్కెట్లలో కుళ్లిన చేపలు

- టీజీ సేఫ్ తనిఖీల్లో బయటపడిన వాస్తవాలు

- బేగంబజార్, రాంనగర్ మార్కెట్లలో భారీగా కుళ్లిపోయిన చేపలు స్వాధీనం
- రాంనగర్‌లో రెండు చేపల దుకాణాల మూసివేతకు నోటీసులు
- చేపల్లో ఫార్మాలిన్ కలిపారా? .. ల్యాబ్‌కు శాంపిల్స్ పంపిన అధికారులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని చేపల మార్కెట్లలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బేగంబజార్, రాంనగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లోని చేపల విక్రయ కేంద్రాలపై ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు 200 కిలోల కుళ్లిన చేపలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేపలను తాజాగా ఉంచేందుకు ఉపయోగిస్తున్నారనే అనుమానంతో నిషేధిత రసాయనాలను కూడా అధికారులు గుర్తించారు. టీజీ సేఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మొత్తం 19 ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.ఫుడ్ సేఫ్టీ అధికారులు, టీజీ సేఫ్ పోలీసులు, స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ సిబ్బంది, జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 19 చేపల విక్రయ కేంద్రాలతో పాటు పలువురు

2లో..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

వరంగల్-ఖమ్మం-నల్గొండలో 6.21 లక్షల ఓట్లు

వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 192 మండలాల పరిధిలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 6.70 లక్షల దరఖాస్తులు అందగా, 6,21,086 దరఖాస్తులకు ఆమోదం లభించింది. నిబంధనలకు అనుగుణంగా లేని 49,321 దరఖాస్తులను తిరస్కరించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు కావడం ఈ నియోజకవర్గంలో పోటీ తీవ్రతను తెలియజేస్తోంది.

కాంగ్రెస్‌కు అనుకూలమవుతాయా కొత్త ఓట్లు?

భారీగా నమోదైన గ్రాడ్యుయేట్ ఓట్లు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా మారుతాయన్న అంశంపై భిన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయి నాయకత్వం ద్వారా ఓటరు నమోదును వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. దీంతో తమకు అనుకూలమైన ఓటర్ల సంఖ్య పెరిగిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలు, విద్యాసంస్థలకు సంబంధించిన అంశాలతో పాటు ప్రభుత్వ పనితీరును పట్టభద్రుల్లోకి తీసుకెళ్లి వారి మద్దతు కూడగట్టాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.

నిరుద్యోగ సమస్యలే బీఆర్ఎస్ అస్త్రం!

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సైతం గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి, నిరుద్యోగ సమస్యలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మలుచుకోవాలని భావిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పార్టీ క్యాడర్, విద్యావంతుల మద్దతు తమకు కలిసివస్తుందని బీఆర్ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు.

పట్టణ ఓటర్లపై బీజేపీ, స్వతంత్రుల గురి

మరోవైపు బీజేపీతో పాటు ఇతర రాజకీయ పక్షాలు, స్వతంత్ర అభ్యర్థులు పట్టణ ప్రాంతాల ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. యువత, ఐటీ ఉద్యోగులు, ప్రైవేట్ రంగ ఉద్యోగుల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంప్రదాయ పార్టీ ఓట్ల కంటే అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్, పట్టభద్రులకు ఇచ్చే హామీలు, క్షేత్రస్థాయి ప్రచారం కీలకమవుతాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పోలింగ్ రోజున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే సామర్థ్యం అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే అవకాశం ఉంది.

తుది జాబితాపైనే అందరి దృష్టి!

రెండు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో కలిపి 11,89,191 మంది ఓటర్లకు ముసాయిదా జాబితాలో చోటు దక్కడం ఎన్నికల ప్రాధాన్యతను మరింత పెంచింది. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితా విడుదల కానుంది. ఆ తర్వాత రాజకీయ పార్టీల ప్రచారం మరింత ఊపందుకోనుంది. కొత్తగా నమోదైన పట్టభద్రుల ఓట్లు ఏ పార్టీకి బలంగా మారతాయి? అధికార కాంగ్రెస్‌కు కలిసొస్తాయా? ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తాయా? లేక బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల విజయావకాశాలను పెంచుతాయా? అన్నది తేలాల్సి ఉంది. మొత్తానికి ఈసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యతో పాటు వారి మద్దతు సాధించడమే పార్టీల ముందున్న అసలైన సవాలుగా మారింది.

రాజకీయాలు పక్కన పెట్టండి

ప్రతి ప్రాంతానికి ప్రాతినిధ్యం లభించినప్పుడు, ప్రతి రాష్ట్రం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడు బలమైన ప్రజాస్వామ్యం నిర్మించబడుతుందని ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ముఖ్యమైన జాతీయ సంస్కరణకు జనసేన పార్టీ సపోర్ట్ ఇస్తుందని స్పష్టంగా తెలియజేశారు.

బలమైన ముందడుగు

డీలిమిటేషన్ సంస్కరణ ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని విస్తరించడానికి, బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన ముందడుగని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. 2051 వరకు అన్ని రాష్ట్రాల ప్రస్తుత దామాషా ప్రాతినిధ్యాన్ని కొనసాగిస్తూనే లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలనే ప్రతిపాదన వల్ల మరిన్ని అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఇది సహకార సమాఖ్యవాద స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, ప్రతి రాష్ట్రం పురోగతికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

మహిళల 33 శాతం రిజర్వేషన్‌పై

మహిళలకు ప్రతిపాదిత 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై కూడా పవన్ సానుకూలంగా స్పందించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సంస్కరణను మరింత బలోపేతం చేస్తుందని, చట్టసభల్లో, విధాన నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యానికి మరిన్ని అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. అలాగే దేశ ప్రజాస్వామ్య విస్తృత ప్రయోజనాల దృష్ట్యా, అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికైన ప్రతినిధులు రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ఏకమై ఈ బిల్లుకు మద్దతును ఇవ్వాలని పవన్ కళ్యాణ్ కోరారు.

మిగతా పార్టీల వైఖరిపై ఉత్కంఠ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో డిలీమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనికోసం ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు మద్దతును ఇచ్చాయి. అందులో ఏపీ నుంచి టీడీపీ, జనసేనతో పాటు, వైసీపీ కూడా మద్దతు ఇచ్చినట్లు తెలుస్తుంది. దీనిపై టీడీపీ, జనసేనలు స్పష్టతనిచ్చాయి. అయితే ఈ విషయంలో కాంగ్రెస్, డీఎంకే పార్టీలు, ఇతర ప్రతిపక్షాలు ఎలాంటి వైఖరిని తీసుకుంటాయనేది ఉత్కంఠగా మారింది.

ఆహార కొరత లేదు..

నీటి సమస్యే తీవ్రం

ప్రజలకు సూచించారు. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని, పర్యావరణ పరిరక్షణను నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలాంటి విపత్తులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. క్లైమెట్ కాంక్లేవ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల నిర్వహణ, ఆహార భద్రత తదితర అంశాలపై మాట్లాడారు. జీవరాశిని కాపాడే శక్తి, బాధ్యత రైతులపైనే ఉందని అభిప్రాయపడ్డారు.

డ్రగ్స్, ఆహార కల్తీపై రాజీ లేదు

డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ తర్వాత ఆహార కల్తీ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

ఇందులో భాగంగానే ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పర్యవేక్షించేందుకు టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎంతటి పెద్ద హోటల్‌లోనైనా తనిఖీలు నిర్వహించే అధికారాలను టీజీ సేఫ్‌కు కల్పించామని వెల్లడించారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లను తక్షణమే సీజ్ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే డ్రగ్స్, ఆహార కల్తీ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చెరువులు, కాలువల ఆక్రమణలతోనే ముంపు సమస్య

హైదరాబాద్ నగరంలోని జలవనరులను పరిరక్షించేందుకు హైడ్రా ద్వారా చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. నగరాల్లో చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం ఆందోళనకరమన్నారు. ఫలితంగా నగరం మొత్తం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల పరిధిలో, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.

వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలను ఆక్రమించడంతోనే నగరాల్లో వరద ముప్పు పెరుగుతోందని వివరించారు.

రెండు సెంటీమీటర్ల వర్షానికే నగరం జలమయం

ప్రస్తుతం హైదరాబాద్‌లో గంట వ్యవధిలో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసినా నగరం మొత్తం జలమయమవుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. చుక్క నీరు కూడా భూమిలోకి ఇంకకుండా ఎక్కడ చూసినా కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం వల్ల కొన్నిసార్లు మనకు తక్షణ ఫలితాలు కనిపించకపోవచ్చని, అయితే భవిష్యత్ తరాలు మాత్రం దాని ప్రయోజనాలను పొందుతాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.

డీలిమిటేషన్ బిల్లుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

2051 వరకు కొనసాగించేలా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

అన్ని రాష్ట్రాల్లోనూ 50 శాతం సీట్ల పెంపు

డీలిమిటేషన్‌లో భాగంగా ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచాలన్నది కేంద్రం ప్రతిపాదించిన ప్రధాన అంశం. సాధారణంగా జనాభా మార్పుల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య లోక్‌సభ స్థానాల వాటాలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తాజా ప్రతిపాదనలో రాష్ట్రాల ప్రస్తుత నిష్పత్తిని కొనసాగిస్తూ, అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే విధంగా 50 శాతం సీట్లు పెంచాలని నిర్ణయించినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి.

2051 వరకు 1971 జనాభా లెక్కల ఆధారంగా నిష్పత్తి

రాష్ట్రాల మధ్య లోక్‌సభ స్థానాల పంపిణీకి 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే విధానాన్ని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. అంటే 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రస్తుత సీట్ల నిష్పత్తిని మార్చకుండా ఉంచాలన్నది ఈ ప్రతిపాదనలోని కీలకాంశం. దీనివల్ల జనాభా పెరుగుదల ఆధారంగా కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు, మరికొన్ని రాష్ట్రాలకు తక్కువ ప్రాతినిధ్యం వచ్చే పరిస్థితిని నివారించాలన్న ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశాలకు సంబంధించిన తుది నిబంధనలు బిల్లులో ఎలా ఉంటాయన్నది పార్లమెంటులో ప్రవేశపెట్టే ముసాయిదాతో స్పష్టం అవుతుంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుతో అనుసంధానం

లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను డీలిమిటేషన్‌తో అనుసంధానిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ముందుకు తీసుకెళ్తోంది. 2023లోనే మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్టం ఆమోదం పొందినప్పటికీ, దాని అమలు జనగణన అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడి ఉంది. ఇప్పుడు ఈ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కేంద్రం కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఈనెల 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ఈ బిల్లులపై చర్చకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 30వ తేదీన లోక్‌సభ.. డిసెంబర్ 2వ తేదీన రాజ్యసభ సమావేశం కానున్నాయి. అవసరాన్ని బట్టి డిసెంబర్ 3వ తేదీ వరకు సమావేశాలు కొనసాగవచ్చని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.అయితే కేబినెట్ ఆమోదం పొందినంత మాత్రాన బిల్లు చట్టంగా మారినట్లు కాదు. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇదే అంశానికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. ఈసారి బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్రానికి విపక్షాల మద్దతు కూడా కీలకం కానుంది.మొత్తంగా డీలిమిటేషన్‌లో రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తిని కొనసాగిస్తూనే సీట్ల సంఖ్య పెంచడం, మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడం ఈ ప్రతిపాదనల ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. అయితే తుది బిల్లు నిబంధనలు, పార్లమెంట్‌లో జరిగే చర్చలు, పార్టీల స్పందన ఆధారంగా తదుపరి పరిణామాలు ఉండనున్నాయి.

పరిశ్రమలు, అమరావతి పనులకు ఊతం

నిధులు మంజూరు చేస్తూనే, సమీకృత సచివాలయం మరియు శాఖాధిపతుల కార్యాలయాల నిర్మాణ వ్యయాన్ని రూ.6,641 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1,215 కోట్ల విలువైన పనులకు, శాఖమూరులో 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.626 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదనంగా రాజధానిలో గ్రీన్ వర్క్ ప్యాకేజీ-2 కింద రూ.180.68 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది.మరోవైపు, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇంధన రంగంలోనూ క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యుత్ ఉత్పత్తి అవసరాల కోసం కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసేందుకు ఏపీజెన్‌కోకు అనుమతినిచ్చింది. అలాగే మైలవరంలో 1000 మెగావాట్ల భారీ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 1,127 ఎకరాల భూమిని కేటాయించగా, నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు బదిలీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్ర అభివృద్ధికి ఊతమిచ్చే 30 అజెండా అంశాలకు ఆమోదం

- భారీ పెట్టుబడులకు ఆరు సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదన
- పెనుకొండలో కియా రెండో ఆటోమొబైల్ ప్లాంట్ ఏర్పాటుపై చర్చ
- శ్రీకాకుళంలో అదానీ టైటానియం కాంప్లెక్స్‌కు గ్రీన్ సిగ్నల్ దిశగా అడుగులు
- అచ్యుతాపురంలో సెయింట్ గోబైన్ గ్లాస్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రోత్సాహం
- ఎంఎస్ఎంఈలకు అనుమతుల సరళీకరణకు రైట్ టు బిజినెస్ బిల్లుకు ఆమోదం
- అమరావతి సచివాలయ నిర్మాణ వ్యయం రూ.6,641 కోట్లకు పెంపు
- రాజధాని గ్రామాల్లో రూ.1,215 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి
- కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కుకు రూ.1,500 కోట్ల రుణ ప్రతిపాదన
- మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ కెమికల్ పార్కు ఏర్పాటుపై కీలక నిర్ణయం
- కోల్ ఇండియాతో ఏపీజెన్‌కో ఒప్పందం.. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు ప్రోత్సాహం
- అర్హమైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు నిర్ణయం
- మైక్రోసాఫ్ట్, గూగుల్ క్లౌడ్ సేవల వినియోగంపైనా కేబినెట్ చర్చ

డ్రగ్స్ రహిత భారత్ కోసం పనిచేద్దాం



ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, నషా ముక్త్ భారత్ పాదయాత్రలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేపించారు.వికసిత్ భారత్ లో భాగంగా నషా ముక్త్ భారత్ కోసం మా వంతుగా పాడుపడతామని, ఈ విషయాన్ని ఇతరులకు మాటల ద్వారా, చేతల ద్వారా, వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లనని, సమాజాన్ని కూడా అలాగే ఉండేలా చేస్తామన్నారు. తల్లిదండ్రుల కలల సాకారం చేసి, మా లక్ష్యాలను అందుకుని జీవితంలో విజయం సాధిస్తామని వాగ్దానం చేపించారు. రాష్ట్రంతో పాటు దేశానికి మంచి పేరు తీసుకోస్తామని, నషా ముక్త్ భారత్ కోసం కృషి చేస్తామన్నారు.మూడో రోజు 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ప్రసంగించారు. స్వామి వివేకానంద చెప్పిన "లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి" అనే సందేశాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. యువతే దేశానికి రేపటి పౌరులని, వారిలో అపారమైన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని పేర్కొంటూ, మత్తులో మునిగి నిద్రపోకుండా సూర్యుడిలా దేశాన్ని మేల్కొలిపేలా తమ శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థి దశ జీవితంలో ఎంతో విలువైనదని, ఆ దశలో తీసుకునే సరైన నిర్ణయాలే భవిష్యత్తుకు పునాది వేస్తాయని సాయికుమార్ అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులను ప్రేమించాలని, గురువులను గౌరవించాలని, దైవాన్ని ప్రార్థించాలని సూచించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ కొన్ని హద్దులు, నియమాలు ఉంటాయని, వాటిని దాటకుండా తల్లిదండ్రుల మాట వింటూ, గురువులు చూపిన సన్మార్గంలో నడవాలని హితవు పలికారు. నేటి విద్యార్థుల నుంచే రేపు మెగాస్టార్లు, సూపర్‌స్టార్లు, వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకునే ప్రతిభావంతులు ఎదుగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మూడోరోజు సైతం అదే జోరు

ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నాయకత్వంలో నిర్వహిస్తున్న 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని సాయికుమార్ తెలిపారు. యువత ఉజ్వల భవిష్యత్తు కోసం, డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణం కోసం కిషన్ రెడ్డి చేపడుతున్న ఈ మహాయజ్ఞానికి సినీ ప్రముఖులందరూ తమ పూర్తి మద్దతు అందిస్తున్నారని ఆయన వెల్లడించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నగరంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన 'హైదరాబాద్ వాక్ ఫర్ నషా ముక్త్ భారత్' పాదయాత్ర మూడో రోజు అత్యంత ఉత్సాహంగా కొనసాగుతోంది. ముందుగా అమీర్‌పేట్ గురుద్వారాలో కిషన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సత్యం థియేటర్ వద్ద నుంచి పాదయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, నటుడు సాయికుమార్, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి తదితరులు పాల్గొని కేంద్ర మంత్రితో కలిసి అడుగులు వేశారు. మత్తుపదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సినీ ప్రముఖులు స్పష్టం చేశారు. ప్రారంభంలో మోగిన దప్పు దరువులకు నటుడు శివారెడ్డి ఉత్సాహంగా చిందేసి అందరిలో కొత్త జోష్ నింపారు.

హైదరాబాద్ మార్కెట్లలో కుళ్లిన చేపలు

వీధి వ్యాపారుల వద్ద చేపల నాణ్యత, నిల్వ విధానాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో చేపలను అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. చేపల నిల్వకు ఉపయోగిస్తున్న నీరు, ఐస్ నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. కొన్ని దుకాణాల్లో తప్పనిసరిగా ఉండాల్సిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.చేపలు ఎక్కువ రోజులు నిల్వ ఉన్నప్పటికీ తాజాగా కనిపించేలా చేసేందుకు ఫార్మాలిన్ వంటి హానికర రసాయనాలు వినియోగిస్తున్నారా అనే కోణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న చేపల నమూనాలను సేకరించి పరీక్షల కోసం స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. మరోవైపు.. 50 కిలోల నిషేధిత సోడియం ట్రైపాలీఫాస్ఫేట్‌ను కూడా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ల్యాబ్ పరీక్షల ఫలితాల ఆధారంగా రసాయనాల వినియోగంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రాంనగర్ చేపల మార్కెట్‌లో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన 2 దుకాణాలకు అధికారులు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. అక్కడ సుమారు 40 కిలోల పాడైపోయిన చేపలను గుర్తించి వాటిని పారవేయించారు. ఇతర ప్రాంతాల్లోనూ కుళ్లిన చేపలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసే చర్యలు చేపట్టారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని వ్యాపారులకు నోటీసులు అందజేశారు. చేపల విక్రయదారులందరూ తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ పొందాలని, పరిశుభ్రమైన వాతావరణంలోనే చేపలను నిల్వ ఉంచి విక్రయించాలని అధికారులు ఆదేశించారు. నిర్దిష్ట గడువులోగా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.హైదరాబాద్‌లో చేపలు కొనుగోలు చేసే వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ సేఫ్ అధికారులు సూచిస్తున్నారు. చేపల తాజాదనం, వాసన, రంగు, నిల్వ పరిస్థితులను గమనించిన తర్వాతే కొనుగోలు చేయాలని చెబుతున్నారు. అనుమానాస్పదంగా కనిపించే చేపలను కొనుగోలు చేయవద్దని సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు నగరంలోని ఇతర మార్కెట్లలోనూ తనిఖీలు కొనసాగిస్తామని టీజీ సేఫ్ అధికారులు స్పష్టం చేశారు.

వివాదరహిత భూములే లక్ష్యం

అందిస్తామని ప్రకటించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర భూ రీసర్వేను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా కొలిచి భూ రికార్డులను క్షేత్రస్థాయి వాస్తవాలతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన తొలి విడతలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2720 గ్రామాలతోపాటు నక్షాలు లేని 373 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. ఈ విడత సర్వేను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా విస్తరిస్తామని వివరించారు. మొత్తం ప్రక్రియ ఏడాదిన్నరలో సమగ్ర సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి చెప్పారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే తాను తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు.

న్యాయబద్ధంగా భూవివాదాల పరిష్కారానికి కృషి

ఒక్కో సమావేశం నాలుగు నుంచి ఆరు గంటలపాటు కొనసాగిందని క్షేత్రస్థాయిలో భూముల విస్తీర్ణంలో తేడాలు, సరిహద్దు వివాదాలు, రైతుల అభ్యంతరాలపై చర్చించినట్లు చెప్పారు. సర్వే సమయంలో భూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు గుర్తించిన ప్రాంతాల్లో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇరు పక్షాలతో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని సూచించినట్లు చెప్పారు. ప్రైవేటు భూ వివాదాల్లో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించదని న్యాయబద్ధంగా పరిష్కారానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలను మాత్రం ప్రభుత్వ రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామని తెలిపారు. సర్వే ప్రారంభానికి ముందే గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తామని మంత్రి చెప్పారు. సర్వే పూర్తయ్యాక భూ యజమానులకు వారి భూమి విస్తీర్ణం, సరిహద్దుల వివరాలు తెలియజేస్తామని.. అభ్యంతరాలు ఉంటే స్వీకరించి విచారణ జరుపుతామని వివరించారు. న్యాయం ఉన్నచోట అవసరమైన సవరణలు చేస్తామని స్పష్టం చేశారు. సర్వేలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచితంగా కొత్త పాస్‌బుక్లు పంపిణీ

సమగ్ర రీసర్వే పూర్తయిన తర్వాత రైతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కొత్త పాస్ పుస్తకాలను ఉచితంగా అందిస్తామని పొంగులేటి ప్రకటించారు. ఇవి వాటర్ ప్రూఫ్‌తో పాటు చిరిగిపోకుండా మన్నికైన రీతిలో ఉంటాయని తెలిపారు. ప్రతి పాస్ పుస్తకంపై ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు

ఆరుద్రోత్సవ వేడుకల్లో ఆధ్యాత్మిక వైభవం

స్వర్ణరథంపై భ్రమరాంబికా మల్లికార్జునుల విహారం..

శివనామస్మరణతో మార్మోగిన శ్రీశైల క్షేత్రం

సాధువులకు కార్తీక వనభోజనాలు.. భక్తులకు ఊయలసేవ

అన్నదానానికి లక్షల్లో విరాళాలు.. సంప్రదాయ కళలకు పట్టాభిషేకం





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ఆధ్యాత్మిక శోభకు నిలయమైన శ్రీశైల క్షేత్రం ఆరుద్రా నక్షత్రం సందర్భంగా భక్తిభావంతో పులకించిపోయింది. భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివార్లకు నిర్వహించిన స్వర్ణరథోత్సవం భక్తులకు కనుల పండువగా నిలిచింది. వేదమంత్రాల నడుమ.. శివనామస్మరణతో.. మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లు స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు కార్తీక మాస పవిత్రతను చాటుతూ సాధువులకు వనభోజనాలు నిర్వహించగా, ఆలయంలో ఊయలసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిపుష్టం చేశాయి.

వైభవంగా స్వర్ణరథోత్సవం..

ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామునే స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లను సర్వాంగసుందరంగా అలంకరించి స్వర్ణరథంపై ఆశీనులను చేశారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ప్రత్యేక సంకల్పం పఠించారు. దేశంలో శాంతిసౌభాగ్యాలు వెల్లివిరియాలని, అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు దరిచేరకూడదని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, అకాల మరణాలు, అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు సంభవించకుండా లోకమంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం వేదమంత్రోచ్చారణలు, భక్తుల హరహర మహాదేవ శివనామస్మరణ మధ్య స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు స్వామి, అమ్మవార్ల రథయాత్ర సాగింది. ఈ సందర్భంగా కోలాటాలు, తప్పెట చిందులు తదితర జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి, సంప్రదాయం, కళల సమ్మేళనంగా స్వర్ణరథోత్సవం అలరించింది.

సాధువులకు కార్తీక వనభోజనాలు..

కార్తీక మాస ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో భాగంగా రుద్రాక్షమఠం సమీపంలోని మహిషాసురమర్దిని ఆలయం వద్ద సాధువులకు దేవస్థానం వనభోజనాలు ఏర్పాటు చేసింది. శ్రీశైలంలో నివసిస్తున్న పలువురు సాధువులతో పాటు భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక సంప్రదాయాల కొనసాగింపులో ఇటువంటి కార్యక్రమాలకు విశిష్ట స్థానం ఉందని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాచీనకాలం నుంచి ధ్యానకేంద్రంగా, సిద్ధక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని, ఎందరో సిద్ధపురుషులు ఈ క్షేత్రాన్ని తమ నివాసస్థానంగా చేసుకున్నారని వివరించారు.

భక్తులకు ఊయలసేవ.. పుష్పాలంకరణ..

ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలానక్షత్రం రోజుల్లో నిర్వహించే సంప్రదాయంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు సాయంత్రం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణ సంకల్పం, మహాగణపతి పూజ అనంతరం ఊయలలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు, పుష్పార్చనలు చేసి ఊయలసేవను భక్తిశ్రద్ధలతో జరిపించారు.

అన్నప్రసాదానికి దాతల ఉదారత..

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి దాతలు ఉదారంగా విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన పి. నిఖితారెడ్డి రూ.1,00,001, కడపకు చెందిన ఎస్. శ్రీనివాస్ గణేష్ రెడ్డి రూ.1,00,116, గుంటూరుకు చెందిన జి. నాగలక్ష్మి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. ముగ్గురు దాతలు అందించిన మొత్తం రూ.3,01,233. భక్తులకు నిత్య అన్నప్రసాద సేవ అందించేందుకు తమ వంతు సహకారం అందించడం విశేషం. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితుడు ఎ. శ్రీనివాసులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుపోటు పొడిచిన వైసీపీ

- ఇందుకూరులో హామీ ఇచ్చి మాట తప్పిన నాయకులు 300 మంది రాజీనామాకు సిద్ధం



దేవీపట్నం ఇందుకూరు గ్రామ పంచాయతీలో వైసీపీ బీసీలకు వెన్నుపోటు పొడిచింది. సర్పంచ్ పదవి ఓడిపోయిన దెబ్బ నుండి తేరుకోకముందే, ఇప్పుడు వైస్ ప్రెసిడెంట్ పదవి విషయంలో బీసీలను మోసం చేసిందని గ్రామంలో ఆగ్రహం వ్యక్తమవుతోంది.ఇందుకూరు పంచాయతీలో మొత్తం 7 వార్డుల్లో వైసీపీ మద్దతుదారులు గెలిచారు. అందులో 1వ వార్డులో గెలిచిన బీసీ నాయకుడు రమేష్ కు వైస్ ప్రెసిడెంట్ పదవి ఇస్తామని పార్టీ నాయకులు మొదట హామీ ఇచ్చారు.కానీ చివరి నిమిషంలో ఆ హామీని తుంగలో తొక్కి, 4వ వార్డులో గెలిచిన వ్యక్తికి వైస్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చారు. బీసీల ఓట్లతో గెలిచి, బీసీలకే వెన్నుపోటు పొడిచారని బీసీ నాయకులు దేవర కన్నయ్య మండిపడుతున్నారు.ఆయన మాట్లాడుతూ గతంలో గెలిచిన సర్పంచ్ తమ్ముడినే వైస్ ప్రెసిడెంట్ గా పెట్టుకున్నారు. ఇదేం న్యాయం?" అని ఆయన ప్రశ్నించారు.

వేరే పంచాయతీకి చెందిన వ్యక్తిని మా ఇందుకూరు పంచాయతీలో ఎంపీటీసీగా పోటీ చేయించి గెలిపించాం. అతనికే ఎంపీపీ పదవి కూడా ఇచ్చాం. మేము ఎప్పుడూ పార్టీ కోసం త్యాగం చేస్తూనే ఉన్నాం, కానీ మాకు మాత్రం ఎప్పుడూ మొండిచెయ్యే చూపిస్తున్నారు" అని దేవర కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

300 మంది రాజీనామాకు సిద్ధం ఈ వెన్నుపోటును సహించేది లేదు. నాతో పాటు ఇందుకూరు గ్రామానికి చెందిన 300 మంది బీసీలు పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాం" అని దేవర కన్నయ్య స్పష్టం చేశారు.ఇప్పుడు అందరి దృష్టి నియోజకవర్గ అధిష్టానం మీదే ఉంది. ఈ గొడవలను అధిష్టానం సర్దుబాటు చేస్తుందా? లేక పట్టించుకోకుండా వదిలేస్తుందా? అనేది ఇందుకూరులో పెద్ద చర్చగా మారింది.అధిష్టానం వెంటనే జోక్యం చేసుకోకపోతే, 300 మంది బీసీలు పార్టీని వీడడం ఖాయమని తెలుస్తుంది

భార్యకు తోడుగా భర్త ప్రచారం

- మంచం గుర్తు కు ఓటేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం



కౌతాళం ఓటర్లను కలవడమే లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థి మా సతీమణి కురువ మల్లేశ్వరి ని మంచం గుర్తుకు ఓటేసి గెలిపించి ఆశీస్సులు ఇవ్వాలని భార్యాభర్తలిద్దరూ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో కోరుతున్నారు.. ప్రతి వీధి, ప్రతి గడపను సందర్శిస్తూ గ్రామ ప్రజల సమస్యలు, వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచారంలో భార్యకు భర్త అండ సర్పంచ్ అభ్యర్థిగా కురవ మల్లేశ్వరి మంచం గుర్తుపై పోటీ చేస్తుండగా, ఆమె భర్త కూడా ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తున్నారు. ఎన్నికల వేళ భార్యాభర్తలిద్దరూ కలిసి గ్రామమంతా తిరుగుతూ ప్రచారం చేయడం స్థానికంగా ఆసక్తిని కలిగిస్తోంది. సుమారు 9,500 మంది ఓటర్లను నేరుగా కలవాలనే లక్ష్యంతో సాగుతున్న ప్రచారం లో ప్రతి ఓటరును పలకరించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు.మంచం గుర్తుపై పోటీ చేస్తున్న కురవ మల్లేశ్వరి ప్రచారం ప్రస్తుతం కౌతాళంలో చర్చనీయాంశంగా మారింది. చివరకు ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారనేది ఎన్నికల ఫలితాల తర్వాత తేలనుంది.ఒకరి పోటీకి మరొకరి తోడు.. ఇద్దరి ప్రయాణం ఒకే లక్ష్యం.. ప్రజలను నేరుగా కలవడమే ప్రచార మార్గంగా ముందుకు సాగుతున్న కురవ మల్లేశ్వరి దంపతులు!

డీజీపీకి స్వాగతం



కామారెడ్డి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం కోసం కామారెడ్డి విచ్చేసిన తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్,కి ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం డీజీపీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి,మొక్కలు నాటారు

ఇందుకూరు పంచాయతీలో టీడీపీ ఘన విజయం

- గట్టి పోటీ ఇచ్చి ఓడిపోయిన వైసీపీ



దేవీపట్నం దేవీపట్నం మండలం ఇందుకూరు మేజర్ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. మొదటి నుంచి వైసీపీ, టీడీపీ మధ్య గట్టి పోటీ నెలకొంది. వైసీపీ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ చివరకు 125 ఓట్ల మెజారిటీతో టీడీపీ సర్పంచ్ అభ్యర్థి చవలం రమణమ్మ గెలుపొందారు.12 వార్డులకు గాను 7 వార్డులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, 5 వార్డులు టీడీపీ కైవసం చేసుకుంది. అయితే సర్పంచ్ ఓట్ల లెక్కింపులో చవలం రమణమ్మ మెజారిటీలో ఉండటంతో 125 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.గెలుపు వార్త తెలియగానే టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సర్పంచ్ చవలం రమణమ్మకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.తనను గెలిపించిన ఇందుకూరు ప్రజలకు, తన కోసం కష్టపడిన కార్యకర్తలకు చవలం రమణమ్మ కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం చవలం శివరామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకున్న అభిమానంతోనే గెలుపొందామని, పంచాయతీ పెద్దలకు, ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. పంచాయతీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు.

బండ్లగూడలో ఇంట్లోనే కార్ల వ్యాపారి దారుణ హత్య

- బాల్కనీ నుంచి నిందితుడి పరార్



హైదరాబాద్ బండ్లగూడలోని అబూబకర్ కాలనీలో 46 ఏళ్ల కార్ల వ్యాపారి మహమ్మద్ అబ్దుల్ రహీమ్ ఇంట్లో దారుణ హత్యకు గురయ్యాడు. తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో ఘటన జరిగినట్లు సమాచారం. గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తలుపు తట్టి లోపలికి ప్రవేశించాడు. భార్య తలుపు తీయగానే అబ్దుల్ రహీమ్ గురించి అడిగి, ఆయన ఉన్న గదిలోకి వెళ్లి లోపల నుంచి తలుపు వేసుకున్నట్లు తెలుస్తోంది. గదిలోకి వెళ్లిన నిందితుడు అబ్దుల్ రహీమ్‌పై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం బాల్కనీ నుంచి పరారైనట్లు సమాచారం. నిందితుడి పరారీ దృశ్యాలు సీసీటీవీలో రికార్డైనట్లు తెలుస్తోంది. హత్యకు ఆర్థిక లావాదేవీలు లేదా కార్ల కొనుగోలు, అమ్మకాల వ్యాపారంలో వివాదాలు కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బండ్లగూడ పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుడి కోసం గాలిస్తున్నారు.

'రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి'

- నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి వి.వినోద్ కుమార్

చండూరు : ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా యాసంగిలో సరిపడా నీటి లభ్యత లేనందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి వి.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం చండూరు మండలం దోనిపాముల గ్రామంలోని కరువు ప్రభావిత పత్తి పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. కరువు కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి త్వరలోనే కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? ఆరుతడి పంటలు వేయడం వల్ల నీటి వాడకం తగ్గుతుందని, అలాగే పప్పు ధాన్యాల వల్ల భూమిసారం పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బి.వేణుగోపాల్, ఏవో పి.మల్లేష్, ఏఈఓలు పద్మజ, పవన్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



హైదరాబాద్ (జగిత్యాల జిల్లాకు చెందిన సింధూజ అలియాస్ తుషారిక (36), మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తూ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది.

పదేళ్ల క్రితం విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్న ఆమె, గత నాలుగు నెలలుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొంది.నవంబర్ 26న స్నేహితుడు రాజిరెడ్డి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ ర్యాలీ

రాజన్న సిరిసిల్ల చలో కరీంనగర్ –దీక్ష దివాస్ స్ఫూర్తి సభ విజయవంతం కావాలని బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ప్రచార ర్యాలీ నిర్వహించడం జరిగింది..

ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి మాట్లాడుతూ దీక్షా దివాస్ అనేది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఘట్టం స్వరాష్ట్రం కోసం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వారి ప్రాణాలను పణంగా పెట్టి సాగించిన నిరాహార దీక్ష ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిక అని అన్నారు. నాటి కెసిఆర్ దీక్ష ఫలితంగానే కేంద్రం దిగివచ్చి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందని ఈ సందర్భంగా అన్నారు..

షాద్‌నగర్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం

షాద్ నగర్ షాద్ నగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బాలాజీనగర్ టోల్‌ప్లాజ్ వద్ద జాతీయ రహదారిపై ఉద్యోగులను ఎక్కించుకునేందుకు వేచి ఉన్న ఎంఎస్ఎన్ కంపెనీ బస్సును లారీ అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు వెనుక భాగం దెబ్బతిన్నది. ఘటనలో గాయపడిన పలువురు ఉద్యోగులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చార్మినార్ పరిసర ప్రాంతాలలో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా పోలీసు కమిషనర్ భద్రతా తనిఖీలు



హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రతే ధ్యేయంగా హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్, శుక్రవారం ప్రార్థనల సందర్భంగా చార్మినార్ జోన్ మరియు చారిత్రాత్మక మక్కా మసీదు పరిసర ప్రాంతాలలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగిసేలా పోలీసు యంత్రాంగం చేపట్టిన భద్రతా ఏర్పాట్లను మరియు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించారు.

ముఖ్యమైన పాయింట్లు ఉ అధికారులకు జారీ చేసిన ఆదేశాలు:

చార్మినార్, మక్కా మసీదు మరియు పరిసర సున్నిత ప్రాంతాలలో మోహరించిన పోలీసు బలగాల పనితీరును, సీసీటీవీ సర్వేలెన్స్ పర్యవేక్షణను మరియు పెట్రోలింగ్ వాహనాల సంచారాన్ని కమిషనర్ తనిఖీ చేశారు.శుక్రవారం ప్రార్థనలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ మళ్లింపులు సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్థానిక నాయకులు, మత పెద్దలు మరియు ప్రజలు అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రద్దీ ప్రాంతాలలో పిక్ పాకెటింగ్, ఈవ్ టీజింగ్ వంటి చర్యలకు తావులేకుండా షీ టీమ్స్ మరియు నిఘా విభాగాల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ భద్రతా తనిఖీ కారే కిరణ్, (డిసిపి – చార్మినార్ జోన్), చార్మినార్ జోన్ అడిషనల్ డిసిపి, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు మరియు ఇతర నగర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కారు పూలింగ్ అవాస్తవం

– సూచన మాత్రమే చేస్తాం..

హైదరాబాద్ : ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కార్ పూలింగ్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో ఓ అసత్య ప్రచారం వైరల్ అవుతోంది. కారులో ఒక్కరే ప్రయాణిస్తే పోలీసులు జరిమానా విధిస్తారంటూ వస్తున్న వార్తలపై తెలంగాణ పోలీసులు స్పష్టత ఇచ్చారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పారు. కారులో ఒంటరిగా ప్రయాణించినందుకు ఫైన్ వేసేలా ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలు తీసుకురావడం లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రజలు కార్ పూలింగ్, ప్రజా రవాణాను వినియోగించుకోవాలని మాత్రమే సూచించినట్లు వివరించారు. కారులో ఒక్కరే ప్రయాణించే వారిపై జరిమానా విధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఖండించింది.ఈ క్రమంలోనే పోలీసుల వివరణను ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. కార్ పూలింగ్ అనేది కేవలం ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేస్తున్న విజ్ఞప్తి మాత్రమేనని తెలిపింది. ఒకే మార్గంలో వెళ్లేవారు తమ ప్రయాణాన్ని ఇతరులతో పంచుకోవడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్యను తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. దీనికి జరిమానాలు, శిక్షలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కారులో ఒంటరిగా ప్రయాణించినందుకు ఫైన్ విధించే ప్రతిపాదన కూడా లేదని తేల్చి చెప్పారు.మరోవైపు.. సైబరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కార్ పూలింగ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ ఎం. రమేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒకే వాహనంలో ఒక్కరే ప్రయాణించే పద్ధతిని తగ్గించాలని సూచించారు. ఒకే రూట్‌లో వెళ్లే ఐదుగురు ఒకే కారులో, ఇద్దరు ఒకే బైక్‌పై వెళ్లేలా ప్రణాళిక చేసుకోవాలని కోరారు. ఇలా చేయడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గి ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు సహకరించినవారవుతారని తెలిపారు.కార్ పూలింగ్ సాధ్యం కానివారు ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సైబరాబాద్ సీపీ రమేష్ సూచించారు. సైబరాబాద్‌లో నివసించే వారు, ఇక్కడ ఉద్యోగాలు చేసేవారు, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం రాకపోకలు సాగించేవారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లే.. తిరిగి తీసుకొచ్చే తల్లిదండ్రులు కూడా వీలైనంతవరకు ప్రయాణాలను సమన్వయం చేసుకోవాలని కోరారు.సైబరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సైకిళ్లపై ప్రయాణించే వారికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడంతోపాటు సురక్షితమైన, ఆటంకాలు లేని ప్రయాణానికి చర్యలు తీసుకుంటామని సీపీ రమేష్ తెలిపారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం, సీసీటీవీ కెమెరాల వివరాలు, వాహనాల రాకపోకల లెక్కల ఆధారంగా వివిధ రహదారుల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలిస్తామని చెప్పారు. గతంలో ఉన్న రద్దీతో పోలిస్తే కార్ పూలింగ్ అమలు తర్వాత వచ్చే మార్పులను కూడా ప్రజలకు చూపిస్తామని వివరించారు.జేఎన్‌టీయూ నుంచి ఐకియా వైపు ఐటీ కారిడార్‌లోకి గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే సుమారు 65 శాతం మంది ఉద్యోగులు వస్తున్నారని సీపీ రమేష్ పేర్కొన్నారు. దీంతో ఆ సమయంలో రహదారులపై తీవ్ర రద్దీ ఏర్పడుతోందని వివరించారు. ఆర్టీసీ సహకారంతో రద్దీ సమయాల్లో అదనపు బస్సులు నడిపి ప్రజా రవాణాను ప్రోత్సహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.కార్ పూలింగ్‌ను ప్రోత్సహించేందుకు గత నెల రోజులుగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరిపినట్లు సీపీ రమేష్ వెల్లడించారు. ఫీనిక్స్, ఇన్ఫోసిస్ సంస్థలు తమ ఉద్యోగుల్లో కార్ పూలింగ్‌ను ప్రోత్సహించేందుకు.. ఇందుకోసం ప్రోత్సాహకాలు అందించే అవకాశాలను పరిశీలించేందుకు ముందుకొచ్చాయని తెలిపారు. మొత్తంగా కారులో ఒక్కరే ప్రయాణిస్తే జరిమానా అనే ప్రచారాన్ని నమ్మవద్దని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అయితే ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు వీలైనంతవరకు కార్ పూలింగ్, ప్రజా రవాణాను ఎంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ అవినీతి నిరోధక శాఖపై పెద్ద మరక

హైదరాబాద్ : అవినీతి తిమింగలాల భరతం పడుతూ రాష్ట్రంలో దూకుడుగా వ్యవహరిస్తున్న తెలంగాణ అవినీతి నిరోధక శాఖపై పెద్ద మరక పడింది. దర్యాప్తు పేరిట ఏసీబీ అధికారులే లంచాలు డిమాండ్ చేసి స్వీకరించారని, అక్రమ ప్రయోజనాలు చేకూర్చారని, ప్రజలను బెదిరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని ఓ ఫిర్యాదుదారుడు సంచలన ఆరోపణలు చేయడం కలకలం రేపింది. రంగారెడ్డి రేంజ్ ఇన్‌స్పెక్టర్ సహా కొందరు ఏసీబీ అధికారులపై ఈ ఆరోపణలు రాగా, అందుకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను ఆధారంగా సమర్పించినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. దీంతో విభాగపరమైన విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి తలెత్తింది.నవంబర్ 21న ఏసీబీ జాయింట్ డైరెక్టర్ కు సమర్పించిన వినతిపత్రంలో ఫిర్యాదుదారుడు పలు కీలక అంశాలను లేవనెత్తారు. జూన్ 20న ఆధారాలతో కూడిన సమగ్ర ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణలో తనకు తగిన అవకాశం ఇవ్వడం లేదని, తనను కేవలం డిపార్ట్‌మెంటల్ విట్‌నెస్ గా కాకుండా అసలు ఫిర్యాదుదారుడిగా, సమాచారం ఇచ్చిన వ్యక్తిగా గుర్తించాలని కోరారు. లంచాల డిమాండ్, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలను సెంట్రల్ జోన్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌కు వ్యక్తిగతంగా అందజేశానని ఆయన తెలిపారు. నవంబర్ 6, 10, 17 తేదీల్లో షెడ్యూల్ చేసిన విచారణకు సిద్ధమయ్యేందుకు అవసరమైన ఛార్జ్ మెమో, విచారణ అధికారి నియామక ఉత్తర్వులు వంటి కీలక పత్రాలను తనకు అందజేయలేదని ఆరోపించారు.మరోవైపు, ఈ ఆరోపణలపై స్పందించిన ఏసీబీ నవంబర్ 25న ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తమ శాఖలో అవినీతి పట్ల 'జీరో టాలరెన్స్' విధానంతో వ్యవహరిస్తున్నామని స్పష్టం చేసింది. అధికారిపై ఆరోపణలపై నిష్పాక్షికమైన, సమగ్రమైన విభాగపరమైన విచారణ కొనసాగుతోందని వెల్లడించింది. ఫిర్యాదు చేస్తున్న వ్యక్తి గతంలో అక్రమాస్తుల కేసులో ఏసీబీ చేత నమోదు చేయబడిన అధికారి అని పేర్కొంటూనే, విచారణ అధికారి ముందు హాజరు కావాలని మూడుసార్లు పిలిచినా అతను రాలేదని ఏసీబీ స్పష్టం చేసింది.అవినీతిపై ఉక్కుపాదం మోపుతూ ప్రజల్లో నమ్మకం పెంచుకుంటున్న వేళ?సొంత శాఖ అధికారులపైనే లంచాలు, బెదిరింపుల ఆరోపణలు రావడం ఏసీబీ ప్రతిష్టకు ఇబ్బందికరంగా మారింది. అటు ఫిర్యాదుదారుడి పత్రాల డిమాండ్, ఆడియో?వీడియో ఆధారాల వాదన, ఇటు విచారణకు హాజరు కాలేదన్న ఏసీబీ వివరణల నేపథ్యంలో.. ఈ అంతర్గత దర్యాప్తు ఏ దిశగా సాగుతుంది, ఏసీబీ తన విశ్వసనీయతను ఎలా నిలబెట్టుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది

గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ హంగులు

హైదరాబాద్ : డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓ రేంజ్‌లో ఏర్పాట్లు చేస్తోంది. దేశవిదేశాల పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న సర్కారు, ఎలాంటి సందేహాలకు, ప్రతికూలతలకు తావులేకుండా వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును వాయిదా వేయాలనో , ఆపేయాలనో ఎల్ నినో వంటి వాతావరణ అంశాలు, ఇతర కారణాలను చూపుతూ కొందరు చేస్తున్న వాదనలను ప్రభుత్వం కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదు. పెట్టుబడుల ఆకర్షణ, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పెంపు విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది.ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ హంగులు అద్దేందుకు, భాగస్వాములు, ప్రతినిధుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రభుత్వం విసూత్న సాంస్కృతిక వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఆధ్వర్యంలో సమ్మిట్ కోసం ప్రత్యేక థీమ్ సాంగ్ ను రూపొందిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, ప్రగతి, భవిష్యత్ ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఈ గీతాన్ని ఏకంగా నాలుగు భాషల్లో తీర్చిదిద్దుతుండటం సమ్మిట్ స్థాయిని, విస్తృతిని చాటిచెబుతోంది. వివిధ ప్రాంతాలు, భాషల నుంచి వచ్చే అతిథులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్న ఈ ప్రత్యేక గీతం సమ్మిట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.సమ్మిట్ ప్రారంభోత్సవ వేదుకలతో పాటు నిర్వహించనున్న క్లైమేట్ కాన్సర్ట్ లోనూ భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యత, సుస్థిరత అనే అంశాలను మేళవిస్తూ నిర్వహించే ఈ కార్యక్రమాలు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపును మరింత బలోపేతం చేసేలా డిజైన్ చేస్తున్నారు. ఒకవైపు పాలనాపరమైన సమీక్షలు, మౌలిక వసతుల కల్పన, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే.. మరోవైపు కళా, సాంస్కృతిక వైభవంతో సమ్మిట్‌ను ఒక పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు సర్కారు సర్వం సిద్ధం చేస్తోంది.ఎల్ నినో పేరుతో వస్తున్న అభ్యంతరాలను, విమర్శలను పక్కనపెట్టి.. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారమే సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించడంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి దృష్టి సారించింది. కీరవాణి సంగీత సారథ్యంలో నాలుగు భాషల గీతం, భారీ సాంస్కృతిక వేదికలతో కూడిన ఈ సదస్సు.. డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ తెలంగాణకు ఇమేజ్ తెస్తుందని ప్రభుత్వం భావిస్తోంది

ఎంజీ యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

నల్గొండ నల్లగొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హాస్టల్ మెస్ నిర్వహణ విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. గత రాత్రి వాగ్వాదం చెలరేగి విద్యార్థులు పరస్పరం కొట్టుకున్నారు. మెస్ మెయింటెనెన్స్, నిర్వహణ బాధ్యతలపై కొంతకాలంగా విభేదాలు తలెత్తాయి. హాస్టల్ డైరెక్టర్ విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కొత్త మెస్ డైరెక్టర్ వచ్చినా సమస్యబ పరిష్కారం కాలేదు.

టైరు పేలి కారులో చెలరేగిన మంటలు..
డ్రైవర్ సజీవ దహనం





– ఆనందపురం పెందుర్తి జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం..

విశాఖ జిల్లాలో ఆనందపురం నుంచి పెందుర్తి వెళ్లే జాతీయ రహదారిపై గురువారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రయాణిస్తున్న కారు టైరు ఒక్కసారిగా పేలడంతో వాహనంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారంతా వ్యాపించడంతో డ్రైవర్ వాటిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు.టైరు పేలిన వెంటనే మంటలు వ్యాపించడంతో డ్రైవర్‌కు బయటపడే అవకాశం లేకుండా పోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు భయాందోళన నెలకొంది.సమాచారం అందుకున్న ట్రాఫిక్ హైవే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పరిశీలన చేపట్టారు.

ట్రై సిటీ పరిధిలోని వాకర్స్‌కు
వరంగల్ పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి



ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ) ఉద్యోగాల నియామకానికి సంబంధించి ప్రిలిమినరీ రాత పరీక్షను వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రై సిటీ పరిధిలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణ మరియు భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా పరీక్షా కేంద్రాలుగా ఉన్న కళాశాలలు, పాఠశాలల మైదానాల్లో వాకర్స్‌కు తాత్కాలికంగా అనుమతి ఉండదు.కావున ట్రై సిటీ పరిధిలోని వాకర్స్ అందరూ ఈ నెల 28-11-2026 (శనివారం) సాయంత్రం 6 గంటల నుండి 29-11-2026 (ఆదివారం) ఉదయం వరకు ఈ క్రింది పరీక్షా కేంద్రాల మైదానాల్లో వాకింగ్‌కు రావద్దని రంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేతసూచించారు. 1. సెయింట్ గాబ్రియేల్ హై స్కూల్, కాజీపేట. 2. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ. 3. కాకతీయ డిగ్రీ కళాశాల, హనుమకొండ. 4. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్. 5. లాల్ బహదూర్ కళాశాల, వరంగల్. 6. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు వాకర్స్ మరియు ప్రజలందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు

ఎస్.ఐ.ఆర్ అమలులో
నిజామాబాద్ జిల్లా పనితీరు భేష్

- అభినందించిన తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం విశ్వేశ్వర్ రెడ్డి

- ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓ లతో సమీక్ష....క్షేత్రస్థాయి పరిశీలన



నిజామాబాద్, నవంబర్ 26 : ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ అమలులో నిజామాబాద్ జిల్లా పనితీరు భేషుగ్గా ఉందని తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం విశ్వేశ్వర్ రెడ్డికితాబిచ్చారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ పర్యవేక్షణలో బీ.ఎల్.ఓలు మొదలుకుని ఈ.ఆర్.ఓల స్థాయి వరకు ఎంతో పకడ్బందీగా, పారదర్శకంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిర్వహించారని ప్రత్యేకంగా అభినందించారు.జిల్లాలో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై గురువారం అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం విశ్వేశ్వర్ రెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు, అదనపు ఏ.ఈ.ఆర్.ఓలతో సమీక్ష జరిపారు. ఈ ప్రక్రియ అమలు తీరు గురించి కలెక్టర్ ఇలా త్రిపాఠి అడిషనల్ సీఈఓ దృష్టికి తెచ్చారు. ఒక్కో నియోజకవర్గం వారీగా ఈ.ఆర్.ఓలకు ఆయన వివరాలు అడిగి తెలుసుకుంటూ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఏ.ఎస్.డీ.డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డిలీటెడ్) జాబితా రూపకల్పనలో పాటించిన మార్గదర్శకాలు, అనుసరించిన పద్ధతుల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్ కు అనుగుణంగా పక్కాగా ఈ ప్రక్రియను నిర్వహించారని అన్నారు.

తుది ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం మరికొంత గడువును పొడిగించిన దృష్ట్యా, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఏ.ఎస్.డీ.డీ జాబితాను మరింత క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అదనపు ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. బీ.ఎల్.ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి ఏ.ఎస్.డీ.డీ జాబితాలో ఉన్న ఒక్కో ఓటరు వారీగా పునఃపరిశీలన జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైనా పొరపాటు జరిగినట్లు గుర్తిస్తే, తక్షణమే దానిని సరి చేసుకునేందుకు ప్రస్తుతం అవకాశం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు సైతం ఓటరు జాబితా నుండి తొలగించబడకూడదని, అదే సమయంలో అనర్హులైన వారి పేర్లు జాబితాలో ఉండరాదని స్పష్టం చేశారు. ఓటరు తుది జాబితా ప్రకటన తరువాత జాబితాలో తమ పేరు లేదని అర్హులైన వారి నుండి ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం ఉండకూడదని అన్నారు. ప్రధానంగా ఆబ్సెంట్, షిఫ్ టెడ్ కేసుల విషయంలో నిశిత పరిశీలన జరపాలని హితవు పలికారు. ఏ.ఎస్.డీ.డీ జాబితా రూపకల్పన సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో క్రియాశీలకమని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఏ.ఎస్.డీ.డీ జాబితాలో బీ.ఎల్.ఏ ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు.

కథ సుఖాంతం..

క్షేమంగా ఒడ్డుకు చేరుకున్న కాకినాడ మత్స్యకారులు

- సముద్రంలో తప్పిపోయిన ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా ఉప్పాడ తీరానికి చేరిక
- బోటు గేర్‌బాక్స్ పాడవడం వల్లే సముద్రంలో - చిక్కుకుపోయినట్లు వెల్లడించిన బాధితులు
- వారం రోజులకు పైగా ఆచూకీ లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు





కాకినాడ : సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కాకినాడ జిల్లా మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వారి బోటు ఉప్పాడ తీరానికి చేరుకోవడంతో దాదాపు వారం రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తమ వారు క్షేమంగా తిరిగి రావడంతో మత్స్యకార కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు 'ఇమ్మాన్యుయేల్' అనే బోటుపై నవంబర్ 4న వేటకు వెళ్లారు. నవంబర్ 10న విశాఖ హార్బర్‌కు చేరుకుని వేటను విక్రయించిన అనంతరం తిరిగి సముద్రంలోకి వెళ్లారు. అయితే నవంబర్ 15 నుంచి వీరి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడం, బోటు ట్రాన్స్‌పాండర్ సిగ్నల్స్ కూడా నిలిచిపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాధితుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. దీంతో కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగి విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో బోటు యజమాని గిరికాన సింహాద్రితో పాటు సూరాడ చిన్న, మెరుగు నారాయణ, గంపల ప్రకాశ్, తిర్రి నారాయణ, కండల రాంబాబు, సూరాడ కొండలరావు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. బోటు గేర్‌బాక్స్ పాడవడం, మొబైల్ సిగ్నల్స్ లేని ప్రాంతంలో ఉండిపోవడం వల్లే తిరిగి రావడం ఆలస్యమైందని, తమ కోసం ప్రభుత్వం గాలింపు చేపట్టిన విషయం తమకు తెలియదని మత్స్యకారులు తెలిపారు. తీరానికి చేరిన వారిని కోస్ట్ గార్డ్, కాకినాడ జిల్లా అధికారులు కలిసి పరామర్శించారు. తమ వారిని సురక్షితంగా రప్పించేందుకు చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీబీ వలలో ఎమ్మార్వో

ఏలూరు ఏలూరు ఎమ్మార్వో రవీంద్రనాథ్ రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పని నిమిత్తం బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో వలపన్ని లంచం తీసుకుంటుండగా రవీంద్రనాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తు సాగుతోంది.

అకాల వర్షంతో ధాన్యం నీటిపాలు

– రైతుల మండిపాటు

సంగారెడ్డి సంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి, కంది, ఆందోల్, చౌటకూర్, పుల్కల్, వట్‌పల్లి, హత్నూర మండలాల్లో అకాల వర్షం కురవడంతో రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. సమయానికి అధికారులు టార్పాలిన్లు అందించలేదని రైతుల ఆరోపణ. వర్షపు నీటికి ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు తడిసిన వడ్లను తిరిగి ఏరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన పంట నీటిపాలవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. 20 రోజులు దాటినా ధాన్యం కొనుగోలు చేయకపోవడమే తమ నష్టాలకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

కార్తీక వేళ.. ఇంద్రకీలాద్రిపై

ఆధ్యాత్మిక వైభవం

- ఆకాశదీపం వెలుగుల్లో మల్లేశ్వరుని సన్నిధి.. సహస్ర లింగార్చనతో శివనామ స్మరణ..
- సహస్ర దీపాలంకరణ.. ఊయల సేవతో పరవశించిన భక్తి లోకం..
- అమ్మవారి అన్నదానానికి రూ.లక్ష విరాళం.. భక్తి చాటుకున్న విజయవాడ వాసి



ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) కార్తీక మాసపు పవిత్రత.. శివనామ స్మరణ.. దీపాల వెలుగుల మధ్య ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. కార్తీక మాసం సందర్భంగా శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.కార్తీక మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. చీకటిని తొలగించి వెలుగును ప్రసరించే దీపం.. భక్తుడి జీవితంలో జ్ఞానం, శాంతి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో శివారాధన చేయడం వల్ల మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక తృప్తి కలుగుతాయని భక్తుల విశ్వాసం.

ఆకాశదీపం.. భక్తి వెలుగుల సందేశం..

మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం వెలిగించడంతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. కార్తీక మాసంలో ఆకాశదీపం దర్శనం విశేష పుణ్యప్రదమని భక్తులు భావిస్తారు. అనంతరం నిర్వహించిన సహస్ర లింగార్చనలో అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజా క్రతువులు నిర్వహించారు. శివలింగాల సమక్షంలో మంత్రోచ్చారణలు, పూజా విధానాలు ఆలయ వాతావరణాన్ని భక్తిమయంగా మార్చాయి.

సహస్ర దీపాల వెలుగుల్లో శివసన్నిధి..

సహస్ర దీపాలంకరణతో ఆలయం వెలుగుల హారంగా కనిపించింది. దీపాల వరుసలు, పుష్పాలంకరణలు, స్వామివారి సన్నిధిలో జరిగిన పూజలు భక్తులకు కనుల పండువగా నిలిచాయి. ప్రతి దీపం ఒక ప్రార్థనగా.. ప్రతి జ్యోతి ఒక భక్తి భావంగా వెలిగిన వేళ ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది.అనంతరం నిర్వహించిన ఊయల సేవలో స్వామివారిని భక్తిశ్రద్ధలతో సేవించారు. ఆలయ అర్చకులు వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు.ఈ విశేష పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ట్రస్టు బోర్డు సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత, రాఘవరాజు, ఏ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వెలుగుల దీపం ఆరింది

- బాలకుటీర్ మంగాదేవి అస్తమయం.. గుంటూరు విద్యారంగానికి తీరని లోటు..
- లాభాపేక్షకు దూరంగా.. పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా సాగిన మహోన్నత ప్రయాణం..
- విద్యార్థుల ఆశాజ్యోతికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘన నివాళి



గుంటూరు(ప్రశ్న న్యూస్) విద్య అంటే వ్యాపారం కాదు.. భావితరాల భవిష్యత్తుకు బలమైన పునాది! పిల్లల చదువు అంటే మార్కుల వేట కాదు.. వారి జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత! ఈ విలువలను ఆచరణలో చూపించి, వేలాది విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నన్నపనేని మంగాదేవి ఇక లేరు. ఆమె అస్తమయంతో గుంటూరు విద్యారంగంలో ఒక విలువల అధ్యాయం ముగిసింది. విద్య, సేవ, సమాజ బాధ్యతలను తన జీవిత ధ్యేయంగా మలుచుకున్న మంగాదేవి సేవలు చిరస్మరణీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు.చోడవరంలోని చేతన ఫౌండేషన్ ఆవరణలో శుక్రవారం కన్నుమూసిన డాక్టర్ మంగాదేవి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఘనంగా నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యే ఆయుధం.. సేవే లక్ష్యం..

శ్రీ వెంకటేశ్వర బాలకోటి ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా, బాలకుటీర్ విద్యాసంస్థల ద్వారా విద్యారంగంలో విశేష సేవలందించిన మంగాదేవి తెనాలి ప్రాంతానికే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమందికి సుపరిచితురాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాధారణంగా వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యతలకే పరిమితమయ్యే వారు ఎందరో ఉంటారని.. కానీ మంగాదేవి మాత్రం తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమించారని కొనియాడారు. పేద కుటుంబాల పిల్లలకు విద్యావకాశాలు కల్పిస్తూ, ఎందరో విద్యార్థుల జీవితాల్లో ఆశాజ్యోతిగా నిలిచారని తెలిపారు. ఆమె చేసిన సేవలు కేవలం విద్యాసంస్థల నిర్వహణకే పరిమితం కాలేదని, సమాజంలో విద్య పట్ల అవగాహన, విలువలు పెంపొందించే దిశగా

ప్రత్యేక పూజల పేరుతో రూ.50 లక్షల మోసం

కాళీమాత ఆలయంలో పూజలు చేస్తామని నమ్మించి నగదు వసూలు.. ప్రధాన నిందితుడు అరెస్ట్

రూ.25.02 లక్షల నగదు, బంగారు ఉంగరం, వెండి బిస్కెట్లు స్వాధీనం.. మరో ఇద్దరు పరారీ





కీసర (ప్రశ్న న్యూస్) ప్రత్యేక పూజలు, తాంత్రిక ఆచారాల పేరుతో ఓ వ్యక్తిని నమ్మించి సుమారు రూ.50 లక్షలు వసూలు చేసిన మోసం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు కాళం క్రాంతి కుమార్ అలియాస్ క్రాంతిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.25,02,500 నగదు, బంగారు ఉంగరం, వెండి బిస్కెట్లు, రెండు సెల్‌ఫోన్లు, ఎస్‌బీఐ రూపే ఏటీఎం కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

కుమార్తె సమస్యను ఆసరాగా చేసుకొని మోసం..

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కుందన్‌పల్లి గ్రామానికి చెందిన మణికంఠ రాము (53) కుమార్తె బ్రహ్మణి ఈ నెల 6న తుడుము రాము అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాము మానసిక ప్రశాంతత కోసం కీసరలోని కాళీమాత ఆలయాన్ని సందర్శించాడు.

అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించే కాళం క్రాంతి కుమార్, అతని భార్య రత్న పరిచయమయ్యారు. ఫిర్యాదుదారుడి పరిస్థితిని ఆసరాగా చేసుకున్న నిందితులు ప్రత్యేక పూజలు, తాంత్రిక ఆచారాలతో కుమార్తె మనసు మార్చి తిరిగి తీసుకొస్తామని, లేదంటే ఆమెను వివాహం చేసుకున్న వ్యక్తిని అంతమొందిస్తామని నమ్మబలికినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సుమారు రూ.50 లక్షలు ఖర్చవుతాయని చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇందులో భాగంగా ఆ2 రత్న కూడా రూ.8 లక్షలు తీసుకున్నట్లు గుర్తించారు. అలాగే పరిచయస్తుడైన ఆ3 పుట్టి సాయి ద్వారా కూడా కొంత నగదు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

మొబైల్ ఫోన్, సిమ్ కార్డులు ధ్వంసం?

ఈ నెల 9న ఫిర్యాదుదారుడిని రాంపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి ఓ పత్రంపై సంతకం చేయించడంతో పాటు అతని మొబైల్ ఫోన్, సిమ్ కార్డులను తీసుకున్నారని, వాటిని ధ్వంసం చేసి మరో సిమ్ కార్డు, కీప్యాడ్ ఫోన్ ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.25 లక్షలకు పైగా నగదు స్వాధీనం..

కేసు దర్యాప్తులో భాగంగా ఈ నెల 26న కీసరలోని కాళీమాత ఆలయం వద్ద ప్రధాన నిందితుడు క్రాంతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు, 4.8 గ్రాముల విరిగిన బంగారు ఉంగరం, సుమారు 50 తులాల బరువున్న మూడు వెండి బిస్కెట్ ముక్కలు, ఫిర్యాదుదారుడికి చెందిన ఎస్‌బీఐ రూపే ఏటీఎం కార్డు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.
నిందితుడు చూపించిన మేరకు రాంపల్లిలోని అతని నివాసంలో మరో రూ.22,52,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం రూ.25,02,500 నగదు స్వాధీనమైనట్లు పోలీసులు వెల్లడించారు.

మరో ఇద్దరి కోసం గాలింపు..

క్రైం నంబర్ 1198/2026, బీఎన్ఎస్ సెక్షన్ 318(4) కింద కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు క్రాంతిని శుక్రవారం (27న) న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నారు. ఈ కేసులో ఆ2 రత్న, ఆ3 పుట్టి సాయి పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మొత్తం రూ.50 లక్షల లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఇతర సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రత్యేక పూజలు, తాంత్రిక పూజలు, చేతబడి, మంత్రతంత్రాలతో వ్యక్తిగత సమస్యలు పరిష్కరిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి భారీ మొత్తంలో నగదు చెల్లించవద్దని కీసర పోలీసులు ప్రజలకు సూచించారు. ఇలాంటి మోసాలు ఎదురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని లేదా డయల్ 100 / 112కు సమాచారం అందించాలని కోరారు. మల్కాజిగిరి సీపీ, డీసీపీ ఆదేశాల మేరకు జవహర్‌నగర్ ఏసీపీ మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఎన్. ఎలక్షన్ రెడ్డి, ఎస్సైలు వి. వెంకట్ రెడ్డి, జి. రఘురాముడు ఈ కేసును ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు జవహర్‌నగర్ ఏసీపీ ఎన్. చక్రపాణి తెలిపారు.

వాసాలమర్రికి కేసీఆర్ దగా..

ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు కాంగ్రెస్ అండ

ఆలేరుపై పదేళ్ల నిర్లక్ష్యం.. ఇప్పుడు అభివృద్ధి పరుగులు

ఏడాదిలో గంధమల్ల ప్రాజెక్టు పూర్తి.. 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు



ఆలేరు(ప్రశ్న న్యూస్) దత్తత పేరుతో గ్రామాన్ని మభ్యపెట్టారు.. ఇళ్ల పేరుతో పేదల ఆశలను కూల్చేశారు.. అభివృద్ధి చేస్తామని ప్రచారం చేసుకున్నారు.. కానీ ప్రజల సమస్యలను మాత్రం గాలికొదిలేశారు! గత పాలకుల తీరుపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వాసాలమర్రి ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఆలేరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సుధగాని మల్లేష్‌గౌడ్ చైర్మన్‌గా, ఏజాజ్ వైస్ చైర్మన్‌గా, పలువురు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీకి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముందు ఆలేరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించగా, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

దత్తత పేరుతో దగా.. పేదల ఇళ్లపై నిర్లక్ష్యం..

వాసాలమర్రిని దత్తత తీసుకున్నామని చెప్పిన కేసీఆర్.. అక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని మంత్రి విమర్శించారు. ఇళ్లు నిర్మిస్తామని చెప్పి పేదల నివాసాలను కూల్చివేశారని, కొత్త ఇళ్ల నిర్మాణం మాత్రం పూర్తి చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల ద్వారా బాధిత పేదలకు అండగా నిలిచిందన్నారు. యాదగిరిగుట్టకు కేసీఆర్ అనేకసార్లు వచ్చినా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపలేదని విమర్శించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించని గత పాలకులు, అభివృద్ధి జరిగిందంటూ ప్రచారానికే పరిమితమయ్యారని మండిపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.

గంధమల్లకు గ్రీన్ సిగ్నల్.. ఏడాదిలో సాగునీటి లక్ష్యం..

ఆలేరు రైతాంగానికి కీలకమైన గంధమల్ల ప్రాజెక్టుపై మంత్రి కీలక ప్రకటన చేశారు. భూసేకరణ కోసం రూ.130 కోట్లు కేటాయించామని, పనులను వేగవంతం చేసి ఏడాదిలోపు ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.గంధమల్ల ప్రాజెక్టు పూర్తయితే లిలి1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశంఉంటుందని పేర్కొన్నారు. రైతుల సాగునీటి కష్టాలను తీర్చడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

యాదగిరిగుట్టలో న్యాక్ కేంద్రం.. యువతకు ఉపాధి బాట..

యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు పెంచేందుకు యాదగిరిగుట్టలో నూతన న్యాక్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.యువతకు వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కల్పించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు.

అమ్మకాలే ముఖ్యం..

ఆ తర్వాత పట్టించుకోరా.?

మౌలాలి టీవీఎస్ తులసీ షోరూం సేవలపై వినియోగదారుల నిలదీత

సర్వీసింగ్ కోసం వచ్చిన వాహనాలకు సకాలంలో మరమ్మతులు కరువు

విక్రయానంతర సేవల నాణ్యత పెంచాలని డిమాండ్



కాప్రా (ప్రశ్న న్యూస్) వాహనాల విక్రయాల సమయంలో చూపుతున్న ఉత్సాహం.. విక్రయానంతర సేవల్లోనూ కనిపిస్తోందా.? లక్షల రూపాయలు వెచ్చించి వాహనాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు సకాలంలో సర్వీసింగ్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయా? మౌలాలిలోని టీవీఎస్ తులసీ షోరూంలో సర్వీసింగ్ సేవల తీరుపై వినియోగదారుల నుంచి ఇలాంటి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా టీవీఎస్ విద్యుత్ ద్విచక్ర వాహనాల సర్వీసింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతుల కోసం వాహనాలను షోరూంకు తీసుకెళ్లినా వెంటనే మరమ్మతులు పూర్తి చేసి అప్పగించడం లేదని, రెండు, మూడు రోజుల పాటు షోరూంలోనే ఉంచుతున్నారని వాపోతున్నారు. సర్వీసింగ్ విభాగంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, సాంకేతిక నిపుణుల కొరత కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

వాహనం లేక రోజువారీ ఇబ్బందులు..



ఉద్యోగ, వ్యాపార, వ్యక్తిగత అవసరాల కోసం నిత్యం ద్విచక్ర వాహనాలపై ఆధారపడే వారికి రోజుల తరబడి వాహనాలు షోరూంలోనే ఉండిపోవడం తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ప్రత్యామ్నాయ రవాణా కోసం అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసినప్పటికీ, అవసరమైన సమయంలో సర్వీసింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో వాటి వినియోగ ప్రయోజనం దెబ్బతింటోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విక్రయాలకే ప్రాధాన్యమా.. సేవలకు లేదా.?

వాహనాల విక్రయాల సమయంలో చూపుతున్న శ్రద్ధను విక్రయానంతర సేవల్లోనూ ప్రదర్శించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. సర్వీసింగ్ విభాగంలో తగినంత మంది సిబ్బందితో పాటు నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులను నియమించి, మరమ్మతులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరుతున్నారు. సర్వీసింగ్ కోసం వచ్చిన వాహనాలను అనవసరంగా రోజుల తరబడి నిలిపివేయకుండా, సాధ్యమైనంత త్వరగా వినియోగదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా టీవీఎస్ తులసీ షోరూం యాజమాన్యం స్పందించి, విక్రయానంతర సేవల నాణ్యతను మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

‘భోగి’ - మూవీ రివ్యూ!



శర్వానంద్ కి ఫ్యామిలీ ఆడియన్స్ లో మంచి క్రేజ్ ఉంది. మొదటి నుంచి ఆయన ఎంచుకుంటూ వచ్చిన కథలు .. పాత్రలు అందుకు కారణం అని చెప్పాలి. అడపాదడపా శర్వానంద్ మాస్ ఆడియన్స్ మనసులు గెలవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అలా ఆయన చేసిన మరో సినిమానే ‘భోగి’. శర్వానంద్ జోడీగా అనుపమా పరమేశ్వరన్ నటించిన మరో సినిమా ఇది. సంపత్ నంది దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. అది ‘ఆదిలాబాద్’ పరిధిలోని ‘బొగ్గులగుట్ట’ అనే ప్రాంతం. అక్కడ కొంతమంది గిరిజనులు నివసిస్తూ ఉంటారు. అక్కడే ‘గంగ’ (శర్వానంద్) ఐదుగురు చెల్లెళ్లతో కలిసి నివసిస్తూ ఉంటాడు. కొలిమి పనులు చేసే ‘గంగ’కి చెల్లెళ్లు అంటే ప్రాణం .. అన్నయ్యే ఆ చెల్లెళ్లకు సర్వం. ‘గంగ’ ఇంటికి ఎదురుగానే ‘సులోచన’ (అనుపమా పరమేశ్వరన్) నివసిస్తూ ఉంటుంది. మోదుగు ఆకులను విస్తళ్లుగా కుట్టేసి అమ్ముతూ ఉంటుంది. గంగ – సులోచన ఇద్దరూ ప్రేమించుకుంటూ ఉంటారు. ‘బొగ్గుల గుట్ట’లోని వాళ్లంతా ‘పటేల్’ (శరత్ లోహితస్య) కనుసన్నలలో బ్రతుకుతుంటారు. ఆయన చేతికింద బలమైన అనుచర వర్గం పనిచేస్తూ ఉంటుంది. పటేల్ ఇలాకాలో అడుగుపెట్టడానికి మంత్రులు సైతం ఆలోచన చేస్తుంటారు. అంతగా ఆయన రాజకీయాలను సైతం ప్రభావితం చేస్తుంటాడు. అమావాస్య రోజులలో .. రాత్రివేళలో కన్నెపిల్లలు మాయమవుతూ ఉంటారు. అలాంటి అమ్మాయిలను గురించి ఆ మరుసటిరోజు ఊళ్లో వాళ్లెవరూ మాట్లాడుకోకపోవడం విచిత్రం. ‘బొగ్గుల గుట్ట’ ఊరు నుంచి కన్నెపిల్లలు మాయమవుతున్న విషయం ‘గంగ’ దృష్టికి వస్తుంది. అందుకు కారణం ‘నరబలి’ అనే సంగతిని అతను గమనిస్తాడు. ఇకపై నరబలి జరగకుండా చూడాలని బలంగా నిర్ణయించుకుంటాడు. అసలు నరబలికి ఎవరు పాల్పడుతున్నారు? దేనిని ఆశించి నరబలి చేస్తున్నారు? ఈ దుర్మార్గం వెనుక గల ప్రధానమైన ఉద్దేశం ఏమిటి? దీని వెనుకున్న సూత్రధారులు ఎవరు? అది తెలుసుకున్న గంగ ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది మిగతా కథ. ఒకప్పుడు దొరలు .. దొరవార్లు .. పట్వారీల కాలం నడిచింది. వారి పెత్తనం నడిచిన కాలంలో అమాయకులైన గిరిజన ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో బలంగా ఉన్న మూఢ విశ్వాసాలకు కూడా గిరిజనులే ఎక్కువగా బలైపోయారు. అలా ‘గడీ’ పాలనను నడిపిస్తున్న ఒక పటేల్ ను ఒక సాధారణ యువకుడు ప్రశ్నిస్తే ఏమౌతుంది? ఎదిరిస్తే ఏం జరుగుతుంది? అనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకున్నారు. లవ్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ ను టచ్ చేస్తూ, విలేజ్ నేపథ్యంలో ఈ కథను నడిపించారు. ఈ కథ మొదలైన తీరు చూసి ఇది దొరల కాలంలో ఒక యువకుడు చేసే పోరాటమేమోనని అనుకుంటారు. ఆ తరువాత స్వార్థ రాజకీయ నాయకుల కారణంగా ఒక గూడెం ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగింది అనేది ప్రధానమైన కథ కావొచ్చునని అనుకుంటారు. అంతలో క్షుద్ర విద్యలు – నరబలి అనే అంశం తెరపైకి వస్తుంది. ఇలా ఇది కాదు .. అది అన్నట్టుగా అంచెలంచెలుగా కథ మలుపులు తీసుకుంటూ, ప్రేక్షకుడు ఏ అంశానికి కట్టుబడి ఉండాలనేది తెలియని ఒక అయోమయానికి గురి చేస్తుంది. 100 మందికి పైగా కన్నెపిల్లలను బలిచ్చిన విషయం చివరి వరకూ హీరోకి తెలియకపోవడం .. హీరో ఐదుగురు చెల్లెళ్లను ఒకేసారి ఇంటి నుంచి తీసుకుని వెళుతున్న సంగతి ఎవరికీ తెలియకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆభరణాలు కరిగించి ఆయుధాన్ని తయారు చేయడం .. శవాలను ఎడ్ల బండ్లపై వేసి పంపించడం .. నెత్తుటి ధారలు ఇంటర్వెల్ అనే అక్షరాలుగా మారడం వంటి సన్నివేశాలు కాస్త అతిగా అనిపిస్తాయి. మాటిమాటికి మలుపు తిరిగే ఈ కథలో ఫైనల్ ట్విస్ట్ కూడా ప్రేక్షకులు ఉలిక్కిపడేలా చేస్తుంది. కాస్త అనుభవం ఉన్నవారిని పాత సినిమాల కాలంలోకి తీసుకుని వెళుతుంది. 1960ల నేపథ్యంలో నడిచే కథ కావడం వలన విలన్ అనుచరులు సైకిల్ ఉపయోగించడం వరకూ ఓకే. కాకపోతే కిడ్నాప్ చేసిన కన్నెపిల్లలను మూటగట్టి సైకిల్ పై తీసుకుని వెళ్లడం .. అదీ అమావాస్య రాత్రుళ్లు .. ఇది కాస్త విడ్డూరంగానే అనిపిస్తుంది. సాధారణంగా ప్రీ క్లైమాక్స్ నుంచి కొట్లాటలు ఊపందుకుని, క్లైమాక్స్ ఉద్ధృతస్థాయికి చేరుకుంటాయి. కానీ ఈ సినిమా సెకండాఫ్ నుంచే రివేంజ్ మొదలవుతుంది. వరసబెట్టి తలలు తెగిపడుతూ ఉంటాయి. రక్తంతో స్నానాలు చేస్తుంటారు. కానీ ఆడియన్స్ కి ఏమీ అనిపించదు. అందుకు కారణం .. ఎమోషన్స్ లేకపోవడం .. ఉన్నది కనెక్ట్ కాకపోవడం అనే చెప్పాలి. శర్వానంద్ లుక్ పరంగా కాస్త డిఫరెంట్ గా అయితే కనిపించాడు. కాకపోతే కథలో విషయం లేకపోవడం వలన, ఆయన ఏమీ చేయలేకపోయాడు. హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ అయినప్పటికీ, పాపం ఆమె పాత్రకి అంతగా ప్రాధాన్యత కనిపించదు. ఇక డింపుల్ హయతి ‘వేశ్య’ పాత్ర వలన ప్రయోజనం ఏమిటనేది మనకి తెలియదు. ఇక ‘ఆదుకాలం నరేన్’ ను సరిగ్గా ఉపయోగించుకోలేదు. ఆయన కనిపించిన సీన్ కూడా చాలా కృతకంగా అనిపిస్తుంది. కిశోర్ కుమార్ ఫొటోగ్రఫీ బాగుంది. అడవి నేపథ్యంలోని విజువల్స్ ఆకట్టుకుంటాయి. భీమ్స్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. తమ్మిరాజు ఎడిటింగ్ విషయానికి వస్తే, కొన్ని యాక్షన్ సీన్స్ ను ఇంకాస్త ట్రిమ్ చేసుకోవచ్చునని అనిపిస్తుంది. సాధారణంగా ఇంటర్వెల్ బ్యాంగ్ అనేది సెకండాఫ్ పై కుతూహలాన్ని పెంచుతుంది. కానీ ఈ సినిమా ఇంటర్వెల్ బ్యాంగ్ నిరాశపరుస్తుంది .. బలహీనమైన స్క్రీన్ ప్లే నిట్టూర్పు విడిచేలా చేస్తుంది.

వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టే ‘ఐ హేట్ మ్యారేజ్’



‘బయట ఓ అబ్బాయిని ప్రేమిస్తారు. ఇంట్లో తల్లిదండ్రులు చూపించిన మరో అబ్బాయిని పెళ్లి చేసుకుంటారు. ఇది నేటి కొందరు అమ్మాయిల తీరు. అసలు ఎందుకిలా జరుగుతోంది? ప్రేమపై క్లారిటీ లేకా? పెళ్లిపై నమ్మకం లేకా? ఈ రెండూ కాక, తల్లిదండ్రులపై ఉన్న గౌరవమా? ఈ ప్రశ్నలకు సమాధానమే నా ‘ఐ హేట్ మ్యారేజ్’ చిత్రం’ అంటున్నారు దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల. సమాజంలోని వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటించారు. మాదం దయాసంద్, కార్తీక్ వెంపటి నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల విలేకరులతో మాట్లాడారు. ‘ఎలాంటి ఎమోషన్స్ లేని అబ్బాయి, ఓ ఆకతాయి అమ్మాయి మధ్య జరిగే కథ ఇది. సమాజంలోని వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుంది. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా ఆకట్టుకుంటుంది’ అని తెలిపారు పరమేశ్ రేణుకుంట్ల.

అంచనాలు నిజమయ్యాయి!



‘ఈ సినిమా చూసినవారందరూ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. వసూళ్లు కూడా చాలా బాగున్నాయి. ఈ చిత్రానికి అవార్డులు కూడా వస్తాయనే నమ్మకం ఉంది’ అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ‘ఆకాశంలో ఒక తార’ సక్సెస్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శృతిహాసన్, రుహాని శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి పవన్ సాదినేని దర్శకుడు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా సంస్థలు నిర్మించాయి.ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ..ఈ సినిమా విషయంలో తమ అంచనాలన్నీ నిజమయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. తమ సంస్థలో తొలి నుంచి ఉత్తమ కథా చిత్రాల్ని అందిస్తున్నామని, ఇది సమాజానికి ఉపయుక్తమయ్యే చిత్రమని స్వప్నదత్ పేర్కొన్నారు. కథలోని సహజత్వం ప్రేక్షకుల హృదయాల్ని కదిలిస్తున్నదని గంగరాజు గుణ్ణం తెలిపారు. ఈ సినిమా ద్వారా నటిగా మంచి గుర్తింపు దక్కిందని కథానాయిక సాత్విక వీరవల్లి ఆనందం వ్యక్తం చేసింది.

‘హైకూ’ (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



ప్రేమకథలకు యూత్ నుంచి విపరీతమైన సపోర్టు లభిస్తూ ఉంటుంది. ఫీల్ గుడ్ లవ్ మూవీస్ చాలా ఫాస్టుగా సక్సెస్ దిశగా పరిగెడుతూ ఉంటాయి. కంటెంట్ ఏ మాత్రం యూత్ కి కనెక్ట్ అయినా భాషతో సంబంధం లేకుండా భారీ విజయాలను రాబడుతూ ఉంటాయి. అలాంటి ఒక రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందిన సినిమానే ‘హైకూ’. ఏగన్ .. శ్రీదేవి .. ఫెమీనా జార్జ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, అక్టోబర్ 23వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ సినిమా ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. మనోహర్ (ఏగన్) కోయంబత్తూర్ లోని ఒక కాలేజ్ లో ఇంజనీరింగ్ చదువుతూ ఉంటాడు. ఆ సమయంలోనే అతనికి ‘కాడి’ (శ్రీదేవి) పరిచయమవుతుంది. ఆమె ఓ శ్రీమంతుడి కూతురు. ఆమె తండ్రికి కులం పట్టింపు ఎక్కువ. సాధ్యమైనంతవరకూ ఎవరినీ ఇంటికి కూడా రానీయడు. అలాంటి ఆయన కూతురు. ‘మనో’తో ప్రేమలో పడుతుంది. ఆమె అక్కయ్యతో మాట్లాడిన మనోకి, తాను మంచి జాబ్ కొట్టకపోతే తమ ప్రేమ సక్సెస్ కాదనే విషయం అర్థమవుతుంది. దాంతో అతను చెన్నై బాట పడతాడు. మనో కెరియర్ పరంగా ఎదగడానికి ట్రై చేస్తూ ఉండగా, ‘కాడి’తో దూరం పెరగడం మొదలవుతుంది. ఒకానొక సమయంలో మనో ఒంటరిగా మిగిలిపోతాడు. ఆ సమయంలోనే అతనికి ‘నివేద’(ఫెమీనా జార్జ్) పరిచయమవుతుంది. తన ఆఫీస్ లోనే పనిచేస్తున్న నివేద, బాయ్ ఫ్రెండ్ ‘అరుళ్’తో ఇబ్బంది పడుతుందనే విషయం మనోకి అర్థమవుతుంది. మనో కారణంగానే ఆమెకి అరుళ్ నుంచి విముక్తి కలుగుతుంది. అప్పటి నుంచి ఆమె మనోను లవ్ చేయడం మొదలుపెడుతుంది. ఈ నేపథ్యంలోనే నివేదకి ఒక విషయం అర్థమవుతుంది .. తాను ఎంతగా ఆరాధిస్తూ ఉన్నప్పటికీ అతను ఇంకా ‘కాడి’ని మరిచిపోలేదని. ‘కాడి’ అంతగా అతనిని ఎలా ప్రభావితం చేసిందనేది ఆమెకి అర్థం కాదు. అంతగా ప్రేమించిన వ్యక్తికి ‘కాడి’ ఎందుకు దూరమయ్యాడో .. అందుకుగల కారణాలేవిటో తెలుసుకోవాలని నివేద భావిస్తుంది. అందుకోసం ఆమె ఏం చేస్తుంది? ఆ ప్రయత్నంలో ఆమెకి తెలిసే నిజాలేమిటి? అప్పుడు ఆమె ఏం చేస్తుంది? అనేదే కథ. ప్రేమకథలు ఎన్ని వచ్చినప్పటికీ, ప్రతి ప్రేమకథ కొత్తగానే అనిపిస్తుంటుంది. అదే ప్రేమకి ఉన్న ప్రత్యేకత. డబ్బు .. కులం .. చదువు .. ఈ విషయాల్లోని అంతరాలు ప్రేమకి అడ్డుగోడలుగా మారిపోతూ ఉంటాయి. హీరోయిన్ ప్రేమ కోసం తపించే హీరో పాలిట ఆమె తండ్రి విలన్ గా మారిపోతూ ఉంటాడు. అలా చూసుకుంటే ఈ సినిమా దర్శకుడు అక్కడక్కడా కాస్త రొటీన్ కి భిన్నంగానే ఆలోచించాడని చెప్పుకోవాలి. ‘హైకూ’ రెండు ప్రేమకథల సమ్మేళనం అని చెప్పాలి. కథానాయకుడు ఒకరే .. నాయికలు మాత్రం ఇద్దరు. ఈ ఇద్దరు అమ్మాయిలు ఒక ప్రేమికుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేశారనేదే ప్రధానమైన కథాంశం. ఫస్టాఫ్ లో హీరో జీవితం ‘కొడి’తో ముడిపడి సాగుతుంది. సెకండాఫ్ అంతా నివేదతో అతను సాగించే ప్రయాణంగా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అయితే ఇక్కడ ఇద్దరు అమ్మాయిల స్వభావంలోని వైవిధ్యమే ఈ కథకు పునాదిగా కనిపిస్తుంది. ఈ కథలో ఎక్కడా కూడా ఫన్ కనిపించదు. అయితే కథకి అవసరమైన కామెడీనీ వర్కౌట్ చేసే ఛాన్స్ ఫస్టాఫ్ లో కనిపిస్తుంది. అమ్మాయిలందరి మధ్య హీరో ఫేస్ చేసే ప్రాబ్లమ్స్ ను వినోదభరితంగా చూపించవచ్చు. కానీ ఆ దిశగా డిజైన్ చేసుకోకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. ఇక ఎమోషన్స్ ను పండించడానికి దర్శకుడు కొంతవరకూ ప్రయత్నించాడు గానీ, పెద్దగా వర్కౌట్ కాలేదనే అనిపిస్తుంది. సాధారణంగా హీరో – హీరోయిన్ ప్రేమ విషయంలో ఆమె తండ్రి విలన్ గా మారిపోయి రంగంలోకి దిగడం కనిపిస్తూ ఉంటుంది. అలాంటి ఒక షేడ్ దగ్గరికి వెళుతూనే కథను మరో వైపుకు తిప్పడం, కొత్తదనం కోసం దర్శకుడు చేసిన ప్రయత్నంగా అనిపిస్తుంది. అమ్మాయిల హృదయాన్ని అర్థం చేసుకోవడం అంత తేలికైన విషయం కాదనే ఒక స్థితిలో హీరోను నిలబెట్టేసిన తీరు, సహజత్వానికి దగ్గరగా అనిపిస్తుంది. అలాగే మనోకి ‘కాడి’ దూరమైపోవడానికి .. నివేద దగ్గర కావడానికి క్రియేట్ చేసిన పరిస్థితులు మాత్రం ఆడియన్స్ మద్దతును కూడగడతాయి. ఈ కథలో అక్కడక్కడా వైవిధ్యం కనిపించినప్పటికీ, లవర్స్ కి సంబంధించిన కొన్ని సన్నివేశాలు చాలా రొటీన్ గా అనిపిస్తాయి. ఆల్రెడీ చూసిన సన్నివేశాలనే మళ్లీ చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. నిదానంగా సాగే కథనం కూడా నిరాశను కలిగిస్తుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా బాగా చేశారు. ప్రీయుశ్ గురుస్వామి ఫొటోగ్రఫీ .. సిద్ధూ కుమార్ నేపథ్య సంగీతం .. శక్తి ప్రణీష్ ఎడిటింగ్ గురించి చెప్పుకోవాలంటే, ఫరవాలేదనే చెప్పుకోవాలి. సాధారణంగా ప్రేమకథల నుంచి యూత్ ఫీల్ ను ఆశిస్తారు. ఫీల్ వర్కౌట్ అయితే ఆ సినిమా హిట్ చిత్రాల జాబితాలో చేరిపోవడం జరిగిపోతుంది. లవ్ .. రొమాన్స్ .. కామెడీ .. ఎమోషన్స్ కి సంబంధించిన సన్నివేశాలలో సహజత్వంతో పాటు, గాఢతను కూడా కోరుకుంటారు. కొత్తదనం కొంత ఉన్నప్పటికీ, రొటీన్ సీన్స్ కారణంగా అసహనాన్ని కలిగిస్తుంది. ఓ మాదిరిగా కనెక్ట్ అయ్యే కంటెంట్ గానే ఈ లవ్ స్టోరీ కనిపిస్తుంది.

‘మనుచరిత్ర’లోని పద్యం స్ఫూర్తిగా..



అర్విన్ తేజ్ హీరోగా రూపొందిన చిత్రం ‘బాల 369’. విజయ్‌కుమార్ కలివరపు దర్శకత్వం వహిస్తూ, ఎల్లయ్యతో కలిసి ఈ సినిమాను నిర్మించారు. శుక్రవారం సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ప్రముఖ హీరో నిఖిల్ సిద్ధార్థ ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ‘అల్లసాని పెద్దన రాసిన ‘మనుచరిత్ర’లోని ‘అటజని కాంచే’ పద్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ కథ రాశాను. 15దేశాల్లో ఈ సినిమాను చిత్రీకరించాం. ఈ ప్రయాణాన్ని ఎంతో ఆస్వాదించాను. ప్రతి ఇంట్లో చర్చనీయాంశమయ్యే సినిమా ఇది. చాలా ఫ్రెష్ కంటెంట్. టీమ్ అంతా ప్రాణం పెట్టి పనిచేశారు. వారందరికీ థ్యాంక్స్’ అని దర్శక,నిర్మాత విజయ్‌కుమార్ కలివరపు అన్నారు. హీరో అర్విన్ తేజ్ మాట్లాడుతూ ‘ఈ సినిమా గురించి కంటెంటే మాట్లాడుతుంది. సినిమా క్రియేటివ్‌గా ఉంటుంది. ఒక్కనిమిషం కూడా బోర్ కొట్టదు’ అని నమ్మకంగా చెప్పారు. చిత్ర సమర్పకుడు, నటుడు వైవా హర్ష మాట్లాడుతూ ‘ఈ సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే సమర్పిస్తున్నాను. కుటుంబసమేతంగా చూడాల్సిన సినిమా ఇది’ అని చెప్పారు.ఇంకా నిర్మాత ఎల్లయ్య కూడా మాట్లాడారు.

ఇది నా మెమొరబుల్ ట్రిప్



షూటింగులకు విరామం ప్రకటించి సాహసయాత్రలో బిజీగా ఉన్నది అందాలభామ కయాదు లోహర్. ఉత్తరాఖండ్‌లోని దయారా బుగ్యాల్ బభారియా పర్వతపై ట్రెక్కింగ్ చేయడమే కాక, ఏకంగా పన్నెండు వేల అడుగుల ఎత్తుకు చేరుకొని అక్కడ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది కయాదు. ‘నా ట్రెక్కింగ్ జర్నీలో ఇది తొలి శిఖరం. ముందు ముందు మరిన్ని శిఖరాలు అధిరోహించాలనుంది. కెమెరా ముందు నటించడం ఓ విధమైన కిక్ ఇస్తే.. రియల్‌గా అడ్వెంచర్స్ చేయడం మరో విధమైన కిక్ ఇస్తుంది. ఏదేమైనా ఇది నా మెమొరబుల్ ట్రిప్’ అంటూ ఇన్‌స్టాలో పేర్కొన్నది. ప్రస్తుతం తమిళంలో ‘సూర్య 48’ చిత్రంతోపాటు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ‘మంజనాతి’ సినిమా చేస్తూ బిజీగా ఉన్నది కయాదు. అలాగే మలయాళంలోనూ ఓ సినిమా చేస్తున్నదీ అందాలభామ.

ప్రతీ మహిళా చూడాల్సిన చిత్రం



సామాజిక సంస్కరణల కోసం కృషి చేసిన మహానీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత కథ ఆధారంగా హిందీలో రూపొందించిన ‘పూలే’ చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఆ సినిమా తెలుగు వెర్షన్ నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. అనంత్ నారాయణ్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డా॥ పొన్నం రవిచంద్ర నిర్మించారు. ఏషియన్ సినిమాస్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ప్రతీక్‌గాంధీ, పత్రలేఖ ప్రధాన పాత్రల్లో నటించారు. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ప్రతీ మహిళా తప్పకుండా చూడాల్సిన చిత్రమిదని, ప్రజల్లో స్ఫూర్తిని కలిగించే గొప్ప చిత్రమిదని నిర్మాత డా॥ పొన్నం రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్‌గాంధీ, తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కల జోలికి వెళ్లకుండా చేసిన సినిమా



‘నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా ‘అలియాస్ రుక్మిణి’. కమర్షియల్ లెక్కల జోలికి వెళ్లకుండా, కథ నచ్చి మనస్ఫూర్తిగా చేసిన సినిమా ఇది. ఆడియన్స్‌కి కూడా సినిమా నచ్చుతుందని నమ్మకంతో ఉన్నాను. దీప్తి ఈ సినిమాకు మెయిన్ పిల్లర్. ఒక బిడ్డను తల్లి ఎంత జాగ్రత్తగా చూసుకుంటుందో, ఈ సినిమాను దీప్తి అంత జాగ్రత్తగా చూసుకున్నారు. మా డైరెక్టర్ మురళి తెలుగు సినిమాకు ఒక రాజ్‌కుమార్ హిరానీ. ఇది నా స్ట్రాంగ్ ఫీలింగ్. సినిమా చూశాక ఆడియన్స్ కూడా అదే ఫీలవుతారు. టీమ్ అంతా మనసుపెట్టి పనిచేసింది. తప్పకుండా విజయం సాధిస్తుందని నా నమ్మకం’ అని హీరో నితిన్ ఆశాభావం వెలిబుచ్చారు. ఆయన హీరోగా రూపొందిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘అలియాస్ రుక్మిణి’. ఆఫియా సయ్యద్ కథానాయిక. ‘దండోరా’ఫేం మురళీకాంత్ దేవసోత్ దర్శకుడు. నేచురల్ స్టార్ నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంటా నిర్మించిన ఈచిత్రం డిసెంబర్ 4న విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నితిన్ మాట్లాడారు. ఇష్టపడి, కష్టపడి తీసిన సినిమా ఇదని, కచ్చితంగా ఓ అందమైన సినిమాను చూడబోతున్నారని దర్శకుడు మురళీకాంత్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు పవన్ హెచ్చరిక

- దుంగ వైపు చూడాలంటేనే వెన్నులో వణుకు పుట్టాలి

- కడపలో అటవీశాఖ మెరుపు దాడులు..

114 దుంగలు, 7 వాహనాలు స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

- ఆంబులెన్స్‌లు, కార్లలో సినిమా ఫక్కీలో స్మగ్లింగ్..

పరారీలో ఉన్న ముఠా సభ్యుల కోసం గాలింపు



కడప(ప్రశ్న న్యూస్) ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే స్మగ్లర్లకు ఇకపై అడుగడుగునా అటవీశాఖ ఉచ్చు బిగియనుంది. ఎర్రచందనం దుంగ వైపు చూడాలంటేనే అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటవీ సంపదను కొల్లగొట్టే ముఠాలకు ఉన్న అన్ని దారులూ మూసుకుపోయేలా వ్యూహాత్మక ఆపరేషన్లు నిర్వహించాలని యాంటీ రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.వైఎస్సార్ కడప అటవీ డివిజన్ పరిధిలో శుక్రవారం అధికారులు నిర్వహించిన మెరుపు దాడులు స్మగ్లర్ల గుండెల్లో గుబులు రేపాయి. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 114 ఎర్రచందనం దుంగలు, ఏడు వాహనాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అక్రమ రవాణాకు స్మగ్లర్లు ఎంచుకున్న మార్గాలు, ఉపయోగించిన వాహనాలు అధికారులను సైతం ఆశ్చర్యపరిచాయి.సినిమా ఫక్కీలో ఆంబులెన్స్‌లు, కార్లలో ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పోలీసు, అటవీశాఖ నిఘాకు చిక్కకుండా తప్పించుకోవాలని ముఠాలు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు వారి ఆటలకు అడ్డుకట్ట వేశాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఒక మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్, రెండు టయోటా ఇన్నోవాలు, రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం, ఒక ఆంబులెన్స్ ఉన్నాయి.ఈ ఆపరేషన్‌లో సమన్వయంతో, వ్యూహాత్మకంగా వ్యవహరించి స్మగ్లింగ్ ముఠా కదలికలను గుర్తించిన కడప జిల్లా అటవీశాఖ అధికారి, సిబ్బందిని పవన్ కళ్యాణ్ అభినందించారు. ఆపరేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పించుకున్న ఇతర నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని, ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక ఉన్న అసలు మూలాలను వెలికితీసేలా దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించారు.అడవిని కొల్లగొడితే చట్టం వేటాడుతుంది! అటవీ సంపదను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్, అటవీశాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

బోర్డు సిఇఓ పై పిడికి ఫిర్యాదు

- ఎంపీ ఈటల



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటల.ఆయన పై అనివార్యమైన పరిస్థితుల్లో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి తీసుకువస్తున్నారు అంటూ ఈటెల మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో వారిని కాదని అలహాబాద్ నుండి శానిటేషన్ కాంట్రాక్టర్ ను తీసుకురావడం ఏంటని ఆయన ప్రశ్నించారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ సీఈఓ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తను 26 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. వందల, వేల మంది అధికారులను,వ్యవస్థను చూశాను.కానీ కంటోన్మెంట్‌లో ప్రస్తుత సీఈఓ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గమనిస్తున్నా, మారుతారేమోనని చూశా. కానీ ఆయనలో మార్పు రాకపోక కంటోన్మెంట్ పై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగేనామినేటెడ్ బోర్డు సభ్యురాలు బానుక నర్మదా మల్లికార్జున్ ఎన్నిసార్లు చెప్పినా, మేము కూడా ప్రోయాక్టివ్‌గా, పాజిటివ్‌గా పనిచేయాలని సూచించినా సీఈఓ తీరులోనూ, పని విధానంలోనూ ఎలాంటి మార్పు లేదు అని ఈటల పేర్కొన్నారు.

- పారిశుద్ధ్యం,ఆసుపత్రి నిర్వహణపై ఆగ్రహం:

కంటోన్మెంట్ అభివృద్ధికి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే ఇక కఠిన చర్యలు తప్పవని ఈటల స్పష్టం చేశారు.డబ్బులు మిగులుతున్నాయంటూ చెత్త సేకరించే కూలీలను తగ్గించడం సరికాదు. పారిశుద్ధ్య కార్మికులు, స్వామెంజర్ల సంఖ్యను తగ్గించి వారిని ఇబ్బంది పెడుతున్నారు.సైకో లెక్క వ్యవహరిస్తున్నారు.ఇక్కడ ఉన్న గొప్ప ఆసుపత్రిలో వైద్య పరికరాలు పనిచేయడం లేదు. సిబ్బందిని తొలగించి, జీతాలు కూడా ఇవ్వడం లేదు.ఇక్కడ ఏదో పెద్ద అక్రమాలు జరిగాయని, వాటిని తాను సరిదిద్దుతున్నాననే భ్రమలో ఉంటూ,ఎంపీని, నామినేటెడ్ బోర్డు సభ్యులను,ఎమ్మెల్యేను కనీసం లెక్కచేయకుండా, పట్టించుకోకుండా ఒక మోనోపలీలా,మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారు" అని మండిపడ్డారు.

చెత్త టెండర్లలో అవకతవకల ఆరోపణ:

చెత్త తొలగింపు వంటి చిన్న టెండర్లను కూడా ఎక్కడో అలహాబాద్ నుంచి తీసుకొచ్చారు.గతంలో ఉన్న ఎల్-1 కాంట్రాక్టర్‌పై రకరకాల నిబంధనలు విధించి తొలగించి, కాంట్రాక్టర్‌ను అలహాబాద్ నుంచి తీసుకొచ్చారు.

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం:

అధికారులపై ఫిర్యాదు చేయడం తమకు ఇష్టం లేకపోయినా,పరిస్థితులు అనివార్యంగా మారాయని ఈటల పేర్కొన్నారు.ఇలాగే వదిలేస్తే ప్రజలకి అన్యాయం జరుగుతుంది. కంటోన్మెంట్‌తో పాటు మాకు కూడా చెడ్డపేరు వస్తుంది.అందుకే సీఈఓ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేసిన పనులపై, ఆయన వైఖరిపై కేంద్ర రక్షణ మంత్రి నుంచి ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే పోరాటానికి సిద్ధం అవుతాం. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకుడు బానుక మల్లికార్జున్, శ్రీకాంత్,రవి,బాబు,టోపీ శంకర్,నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా ముషిగంపల శివ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా అద్దంకి యాకాంత రావు, పూజారి సోమయ్య





ఉప్పల్ (ప్రశ్న న్యూస్)వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఎంతో సామరస్యపూర్వక వాతావరణంలో ఏకగ్రీవంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ముషిగంపల శివ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా పిసరి శంకర్ ,ప్రధాన కార్యదర్శిగా అద్దంకి యాకాంత రావు, పూజారి సోమయ్య, కోశాధికారిగా ఆవుల సుధాకర్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు కాలనీ వాసులు అభినందనలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన కోర్ కమిటీ కన్వీనర్ బుచ్చిరెడ్డికి, కోర్ కమిటీ సభ్యులు వేములకొండ సోమశేఖర్ గౌడ్, బిల్లకంటి యాదయ్య, శంకరయ్య గౌడ్, మహాదేవబట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మ, వేములకొండ వెంకన్న గౌడ్, హేండిగా లక్ష్మయ్య, ఆకారపు అరుణ్ పటేల్ కు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాలనీ పెద్దలు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

మౌలిక వసతులతో మారిన బడి రూపురేకలల

ప్రజాధనం ప్రజల కోసమే వారి పిల్లల చదువుకే

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.నిన్న శుక్రవారం కార్ఖానా వార్డు--3లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్డీఎఫ్)ద్వారా రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన ఫ్లోరింగ్,సోలార్‌ప్యానెల్స్,సీసీ కెమెరాలు,ఆర్వో వాటర్ ప్లాంట్లను ఆయన ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బస్తీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లలను భవిష్యత్తులో డాక్టర్లు,ఇంజనీర్లు,పోలీస్ అధికారులు,ఉపాధ్యాయులుగా చూడాలని ఎన్నో కలలు కంటున్నట్లు తన దృష్టికి తెచ్చారని గుర్తు చేశారు.అయితే కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఆ విద్యార్థుల ఉన్నత చదువులకు అడ్డంకిగా మారకూడదనే దృఢ సంకల్పంతో తాను పనిచేస్తున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం తన ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి ఏకంగా రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.కేవలం ఓటు హక్కు ఉన్నవారికే కాకుండా పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సమాజంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని కొనియాడారు.ఉదయం పూట అల్పాహారం లేక విద్యార్థులు ఆకలితో బడికి రావడం వల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని వివరించారు.ప్రతిరోజూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన అల్పాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు విద్యా ప్రమాణాలు కూడా మెరుగుపడుతున్నాయని ప్రశంసించారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు,స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఈ కార్యక్రమంలో ఆయన పిలుపునిచ్చారు.

అనుభవం అంటే పదవులు కాదు.. సేవ!:

మరోవైపు తనను 'ఫస్ట్ టైం ఎమ్మెల్యే' అంటూ తక్కువ చేసి మాట్లాడిన ఎంపీ ఈటల రాజేందర్ తీరుపై శ్రీగణేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఏ రంగంలోనైనా ఎవరైనా మొదటి అడుగు నుంచే ప్రయాణం ప్రారంభిస్తారని,మొదటిసారి అనేది లేకుండా అనుభవం ఎలా వస్తుందని ఆయన సూటిగా ప్రశ్నించారు.రాజకీయాల్లోకి ఎప్పుడు వచ్చామన్నది ముఖ్యం కాదని,ప్రజలకు ఎంతవరకు సేవ చేశామన్నదే అసలైన కొలమానమని అన్నారు.తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనేక నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తున్నానని గుర్తు చేశారు.కానీ 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని,ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పుకునే ఎంపీ ఈటల రాజేందర్ అనుభవం కంటోన్మెంట్ ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడిందని నిలదీశారు.కంటోన్మెంట్ ప్రాంతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి కనీసం అవసరమైన ఎన్ఓసీలు కూడా తీసుకురాలేని అసమర్థ స్థితిలో ఎంపీ ఉన్నారని విమర్శించారు.నియోజకవర్గానికి కేవలం ఒక టూరిస్టులా వచ్చి వెళ్లడం కాకుండా ఇక్కడి స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని చురకలంటించారు.చుట్టూ ఉన్నవారు రాసిచ్చిన స్క్రిప్టులను యథాతథంగా చదవడం మానేసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ అభివృద్ధికి తాను ఏమి చేశానో,అలాగే కంటోన్మెంట్ సహా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ఏమి తీసుకొచ్చారో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు.మీడియా మిత్రుల సమక్షంలో ఒక బహిరంగ చర్చా వేదిక ఏర్పాటు చేయాలని,నిధుల కేటాయింపులు,మౌలిక వసతులు,విద్యాభివృద్ధిపై ఎక్కడైనా,ఎప్పుడైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



ఆక్టోపస్‌కు అష్టదిగ్బంధం కాదు.. అష్టశక్తులు

- రూ.8 కోట్లతో ఆధునిక శిక్షణ వసతులు.. జాతీయ పోటీల్లో ఏపీ కమాండోల డబుల్ ధమాకా

- అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానమే లక్ష్యం- 'ఆక్టోపస్ 2.0'తో సరికొత్త కార్యాచరణ

- నులకపేటలో 42 ఎకరాల ప్రత్యేక ప్రాంగణం.. ఆధునిక శిక్షణకు డీజీపీ శ్రీకారం





మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఉగ్రవాదుల కుట్రలకు చెక్.. అత్యాధునిక ముప్పులకు షాక్.. జాతీయ స్థాయిలో విజయాల జోరు.. అంతర్జాతీయ వేదికపై అగ్రస్థానమే లక్ష్యం! ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ ప్రత్యేక దళం ఇక సరికొత్త శక్తితో ముందుకు సాగనుంది. కమాండోల సామర్థ్యానికి పదును పెట్టేలా రూ.8 కోట్లతో ఆధునిక శిక్షణ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. జాతీయ స్థాయి పోటీల్లో రెండు ప్రథమ స్థానాలు సాధించిన ఏపీ ఆక్టోపస్‌కు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో విజయం.. అంతర్జాతీయ స్థాయిలో ఆధిపత్యం అనే లక్ష్యంతో దళాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట ఆక్టోపస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం అభివృద్ధి పనులకు డీజీపీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక దళాల శిక్షణకు అత్యాధునిక వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆక్టోపస్ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచింది.

శిక్షణకు కొత్త చిరునామా.. సామర్థ్యానికి కొత్త సవాలు..

ప్రత్యేక దళాలకు శిక్షణే ప్రధాన ఆయుధం. ఈ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకుని ఆక్టోపస్ కమాండోల కోసం కంబాట్ ఫిజికల్ కండిషనింగ్ గ్రౌండ్, లాంగ్ ఫైరింగ్ రేంజ్‌ను డీజీపీ ప్రారంభించారు. మాడ్యులర్ సీక్యూబీ ట్యాక్టికల్ హౌస్, వర్టికల్ ట్రైనింగ్ సిస్టమ్, కమాండో ఎండ్యూరెన్స్ ట్రైనింగ్ మాడ్యూల్, పెరిమీటర్ సెక్యూరిటీ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సొంత శిక్షణ ప్రాంగణం లేకపోవడం వల్ల ఇప్పటివరకు ఆక్టోపస్ సామర్థ్యాల విస్తరణకు కొన్ని పరిమితులు ఎదురయ్యాయని డీజీపీ పేర్కొన్నారు. రోజువారీ సాధన, ప్రత్యేక శిక్షణ, కార్యాచరణ ప్రణాళికల అమలుకు పటిష్టమైన మౌలిక వసతులు అవసరమన్నారు. నులకపేటలోని పచ్చదనంతో కూడిన ప్రాంగణం దళం అభివృద్ధికి అనుకూలమని తెలిపారు. భవిష్యత్తులో పోలీసు ఆధునికీకరణ నిధుల ద్వారా మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆక్టోపస్ 2.0'.. మారుతున్న ముప్పులకు మాస్టర్ ప్లాన్..

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద దాడుల స్వరూపం మారుతోంది. సంప్రదాయ దాడులతో పాటు సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత ముప్పులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాత శిక్షణ పద్ధతులకే పరిమితం కాకుండా కొత్త వ్యూహాలు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని డీజీపీ స్పష్టం చేశారు.ఇందులో భాగంగా 'ఆక్టోపస్ 2.0' కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ప్రత్యేక ఇంటెలిజెన్స్, సైబర్, యాంటీ డ్రోన్ విభాగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నిఘా సమాచారాన్ని సమర్థంగా వినియోగించడం, సైబర్ ముప్పులను ఎదుర్కోవడం, డ్రోన్ దాడులను అడ్డుకోవడం వంటి అంశాల్లో కమాండోలకు మరింత శిక్షణ అందించనున్నారు.ముప్పు ఎక్కడి నుంచి వచ్చినా.. ఎదుర్కొనే సామర్థ్యం ఆక్టోపస్ సొంతం కావాలి అన్నదే ఈ ఆధునికీకరణ వెనుక ప్రధాన ఉద్దేశమని డీజీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ లక్ష్మీపతి, ఎస్పీ (ఆపరేషన్స్ అండ్ ట్రైనింగ్) పి. శశికాంత్, ఇతర పోలీసు అధికారులు, ఆక్టోపస్ కమాండోలు పాల్గొన్నారు.

మన్ననూరు - శ్రీశైలం రహదారి..

ప్రమాదాలకు నిలయమా.?

- దశాబ్దాల నాటి ఇరుకు రోడ్డుపై పెరిగిన వాహనాల రద్దీ
- ఘాట్ రోడ్డులో మృత్యుపాశాలుగా మలుపులు
- ఎదురుగా వచ్చే వాహనాల లైట్లతో డ్రైవర్లకు అగోచర పరిస్థితి
- అడవుల పేరుతో రోడ్డు విస్తరణకు అడ్డంకులా.?
- భక్తుల భద్రతపై పాలకులకు పట్టింపు లేదా.?



ప్రత్యేక కథనం-గౌటి రామకృష్ణ ప్రజాప్రశ్న బ్యూరో)



మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు సాగుతున్న ఘాట్ రహదారి ప్రయాణం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించాల్సింది పోయి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించే పరిస్థితిని కల్పిస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఇరుకైన రహదారిపై నేటి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది.

కాలానికి అనుగుణంగా రహదారిని విస్తరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం భక్తులకు ప్రజలకు శాపంగా మారింది.

ఇరుకు రోడ్డు.. పెరిగిన వాహనాల వేగం

మన్ననూరు నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో అనేక ప్రాంతాల్లో అదేవిధంగా సుండిపెంట శ్రీశైల ఆలయం వరకు రహదారి చాలా ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డులోని ప్రమాదకర మలుపులు, ఎత్తుకు మించిన స్పీడ్ బ్రేకర్లు, ఎత్తుపల్లాలు, పరిమిత రహదారి వెడల్పు ప్రయాణాన్ని రాత్రి సమయాలలో మరింత కష్టతరం చేస్తున్నాయి. వాహనాల సంఖ్య పెరుగుతున్నా, రహదారి విస్తరణ మాత్రం దశాబ్దాల నాటి స్థాయిలోనే ఉండటం దురదృష్టకరం. అభివృద్ధి అని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పే పాలకులు శ్రీశైలం కు వెళ్లే దారులు పట్టించుకోకపోవడం ప్రజల దౌర్భాగ్యంగా మారింది.

ఎల్ఈడీ లైట్లతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించని పరిస్థితి

రాత్రి వేళల్లో కొందరు వాహనదారులు హైబీమ్ లైట్లు, అధిక కాంతి కలిగిన ఎల్ఈడీ ఫ్లోరోసెంట్ లైట్లను వినియోగిస్తూ ఓవర్ స్పీడ్ తో ప్రయాణిస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహన డ్రైవర్ల కళ్లపై కాంతి నేరుగా పడటంతో రహదారి కనిపించక గందరగోళానికి గురవుతున్నారు. ఘాట్ రోడ్డులో మలుపుల వద్ద ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. లైట్లను అవసరానికి అనుగుణంగా డిమ్ చేయకపోవడం, వేగ నియంత్రణ పాటించకపోవడం, స్పీడ్ బ్రేకులు చాలా ఎత్తుగా ఏర్పాటు చేయడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

అడవుల పేరుతో విస్తరణకు అడ్డంకులా.?

అటవీ ప్రాంతం కావడంతో రహదారి విస్తరణకు అనుమతులు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అటవీ సంపదను కాపాడుతూనే, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించేలా శాస్త్రీయ ప్రణాళికతో రహదారి అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత కాదా.? ప్రమాదకర మలుపులను తగ్గించి, అవసరమైన చోట రహదారిని వెడల్పు చేస్తే శ్రీశైలం ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా మారదా.? ఈ ఆలోచన పాలకులకు రాకపోవడం ప్రజల దురదృష్టమే కదా.

డ్రైవింగ్ అవగాహన ఎక్కడ.?

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, రవాణా శాఖలు వాహనదారులకు ఘాట్ రోడ్లపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలి. వేగ నియంత్రణ, హైబీమ్--లోబీమ్ వినియోగం, మలుపుల వద్ద అప్రమత్తత, ఓవర్‌టేకింగ్ నిబంధనలపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఘాట్‌రోడ్ లో అడవి శాఖ అధికారులు ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు అత్యంత ప్రమాదకరంగా ఎత్తుగా ఉన్నాయని వాటి పై కార్లు వెళ్లడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలకు ఒళ్ళు నొప్పులు, వెన్నుపూస సమస్యలు రావడంతో పాటు భయాందోళనకు గురవుతున్నారని, కార్లు రిపేర్లకు కారణం అవుతున్నాయని వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి హైదరాబాదు నుండి నిత్యం వేలాది మంది భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారు. వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని మన్ననూరు--శ్రీశైలం రహదారి విస్తరణకు ప్రభుత్వాలు తక్షణ కార్యాచరణ చేపట్టాలి. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భక్తుల ప్రాణాలే ప్రభుత్వాలకు ప్రాధాన్యమా.? లేక నిర్లక్ష్యమే పాలనగా మారిందా.? అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.



జనాభా ఆధారంగా చేస్తే దక్షిణాదికి నష్టమే
కానీ కేంద్రం విధానం వేరు

- డీలిమిటేషన్‌పై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్రం తీసుకొస్తున్న డీలిమిటేషన్ బిల్లు ప్రతిపాదనపై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కీలక విషయాలు వెల్లడించారు. శుక్రవారం ఢిల్లీ వెళ్లిన ఆయన అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే సౌత్ రాష్ట్రాలు నష్టపోతాయని, కానీ కేంద్రం చేస్తున్న డీలిమిటేషన్ విధానం వల్ల అందరికీ ప్రయోజనం ఉంటుందని చంద్రబాబునాయుడు తెలిపారు.

ఎంపీ సీట్లు పెరుగుతాయ్

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు మనకో చారిత్రక అవకాశమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేంద్రం తీసుకొస్తున్న డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణ రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు 50 శాతానికి పెరుగుతాయని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎంపీ సీట్లు 25 నుంచి 38కి చేరుతాయని వెల్లడించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో 17 నుంచి 26కి, తమిళనాడులో 39 నుంచి 59కి పెరుగుతాయన్నారు. ఇక కర్ణాటక రాష్ట్రంలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి పెరుగుతాయని వివరించారు. ఈ మేరకు అందరికీ విన్-విన్ పరిస్థితి ఉందని అన్నారు. ప్రస్తుతం దక్షిణాదిన 129 లోక్‌సభ సీట్లు ఉండగా డీలిమిటేషన్ తర్వాత 195కి చేరుతాయని తెలియజేశారు.

మహిళా రిజర్వేషన్ విషయంలో

ఇదే సందర్భంలో మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రంతో పాటు అడుగులు వేస్తున్నట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, అలాగే పాలిటిక్స్‌లో కూడా ముందు వరసలో ఉండాలని ఆకాంక్షించారు. ఎడ్యుకేషన్, ఐటీ, సాంకేతిక రంగాలలో మహిళలు అద్భుతాలు క్రియేట్ చేస్తున్నారని, అయినప్పటికీ పార్లమెంట్‌లో వారి ప్రాతినిధ్యం 2019లో 14.3 శాతం ఉండగా, 2024 నాటికి 13.6 శాతానికి తగ్గిపోయిందని గుర్తు చేశారు. నిజానికి 1986లోనే ఎన్టీఆర్ స్థానిక సంస్థలలో మహిళలకు తొమ్మిది శాతం రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టారని చంద్రబాబునాయుడు చెప్పారు. అలాగే సొసైటీలో సగం జనాభాగా ఉన్న మహిళల గురించి ప్రతిపక్షాలు ఆలోచించాలని, మహిళ రిజర్వేషన్ బిల్లు విషయంలో సానుకూలంగా ఉండాలని చంద్రబాబునాయుడు సూచించారు.

శివనామ స్మరణతో
మార్మోగిన కపిలతీర్థం

- కపిలేశ్వరుడికి లక్ష బిల్వార్చన - భక్తిభావంతో రుద్రయాగం ప్రారంభం
- వేదమంత్రాలు.. రుద్రజపాలతో ఆధ్యాత్మిక పరిమళాలు
- డిసెంబరు 6 వరకు 11 రోజుల పాటు రుద్రయాగ మహోత్సవం
- రూ.500తో యాగంలో పాల్గొనేందుకు గృహస్తులకు అవకాశం



తిరుపతి(ప్రశ్న న్యూస్) హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో తిరుపతిలోని ప్రాచీన శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. కార్తీక మాస పవిత్రతకు తోడు శుక్రవారం ఆలయంలో నిర్వహించిన లక్ష బిల్వార్చన భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. మరోవైపు స్వామివారి అనుగ్రహం కోసం 11 రోజుల పాటు నిర్వహించనున్న రుద్రయాగ మహోత్సవం వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా ప్రారంభమైంది. ఒకవైపు బిల్వదళాల సమర్పణ.. మరోవైపు రుద్రజపాల హోమధూమం.. వెరసి కపిలేశ్వరాలయం శివమయంగా మారింది.

లక్ష బిల్వాలతో మహార్చన..

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, అనంతరం అభిషేకాలు, విశేష అలంకరణలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన లక్ష బిల్వార్చన మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగింది. త్రిదళాలతో కూడిన పవిత్ర బిల్వపత్రాలతో వేదపండితులు, అర్చకులు ఆగమశాస్త్ర ప్రకారం స్వామివారిని అర్చించారు. ప్రతి బిల్వదళ సమర్పణలోనూ శివనామస్మరణ మార్మోగింది. భక్తులు స్వామివారి అర్చనా వైభవాన్ని దర్శించి పులకించిపోయారు.

రుద్రయాగంతో లోకకల్యాణ ఆకాంక్ష..

శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రయాగం) శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. నవంబరు 27 నుంచి డిసెంబరు 6 వరకు 11 రోజుల పాటు ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. తొలిరోజు యాగశాలలో పూజలు, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పూజలు, రుద్రజపం, హోమం, రుద్రత్రిశతి, బిల్వార్చన, విశేష దీపారాధనతో యాగక్రతువు కొనసాగనుంది. వేదఘోష, రుద్రమంత్రాల నడుమ యాగశాల ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది.

రూ.500తో యాగంలో భాగస్వామ్యం..

రుద్రయాగంలో గృహస్తులు కూడా పాల్గొనేందుకు టీటీడీ అవకాశం కల్పించింది. రూ.500 టికెట్ కొనుగోలు చేసి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. యాగంలో పాల్గొనే గృహస్తులకు ఉత్తరీయం, రవికెతో పాటు అన్నప్రసాదం అందజేస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామివారి సేవలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

పురవీధుల్లో చంద్రశేఖరస్వామి విహారం..

ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ చంద్రశేఖరస్వామివారు, శ్రీ కామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తులను పుష్పాలతో విశేషంగా అలంకరించి తిరుపతి పురవీధుల్లో ఊరేగించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవాయిద్యాలు, భజన బృందాల కోలాటాల నడుమ సాగే ఈ ఊరేగింపు భక్తులకు కనుల పండువగా నిలవనుంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో కుమారి దేవి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588